

# ఘనంగా అంబారీ ఊరేగింపు

## - వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం, సిఎస్ శాంతికుమారి

**బేగంపేట జులై 22,ప్రభాతవార్త**



డప్పు చప్పుళ్ల,పోతురాజుల విన్యాసాలు,ఫలహారం బండ్ల ఊరేగింపుతో సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతర రెండు రోజులుగా అంగ రంగ వైభవంగా సాగింది. అమ్మ వారిని దర్శించుకునేందుకు సోమవారం రోజు కూడా భక్తులు అమ్మ ఆలయానికి పోటెత్తారు.రెండవ రోజులో భాగంగా అమ్మ వారి ఆలయంలో అమ్మ వారికి ఎదురుగా ఉన్న మాతంగేశ్వరి ఆలయం ముందు పచ్చి కుండపై నిల్చొని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.ఈ కార్యక్రమాన్ని కన్నులారా వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి భవిష్యవాణి విన్నారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో పోతురాజులు గావు పట్టారు..అనంతరం అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం పుర వీధుల గుండా సాగింది.అనంతరం అమ్మ వారి సాగనంపు కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సోమవారం ఆలయానికి హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేరుకుని రంగంతో పాటు అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆషాడ బోనాల జాతర ప్రారంభం నుంచి ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.ఆలయ శుద్ధి కార్యక్రమం అనంతరం భక్తులకు అమ్మ వారి దర్శనానికి అనుమతించారు.రెండవ రోజు కూడా భక్తుల కోలాహలంతో శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయానికి వచ్చే దారులన్నీ భక్తులతో నిండిపోయాయి.ఉజ్జయినీ మహాకాళీ కీ జై అంటూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల పూలతో,వివిధ రకాలైన విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేసారు.తెల్లవారుఝామునుంచి ఆలయానికి తరలి వచ్చిన భక్తులు అమ్మ వారికి ఒడి బియ్యం,చీరె,సారెలు,పసుపు కుంకుమలతో అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఏనుగు అంబారీ పై అమ్మ వారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది.ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.ఈ ఏడాది పూజలు సంతోషంగా అందుకున్నానని,ఎవరికీ ఆటంకం లేకుండా చేసుకున్నానని,నన్ను కొలిచి నిండై నిలిచిన మహాకాళీ నేను అని అమ్మ వారు పేర్కొన్నారు.ఏ బోనం తెచ్చినా ఎవరు తెచ్చినా తాను సంతోషంగా స్వీకరిస్తానన్నారు. కోరినన్నివర్షాలు కురుస్తాయని,పిల్లలకు గర్భిణులకు ఏ ఇబ్బంది రానివ్వనని,అందరినీ సంతోషంగా ఆనందంగా ఉండేలా చూసుకుంటానంటూ అమ్మవారు భవిష్యవాణి ముగించారు.



**అలరించిన బాల పోతురాజు....**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాలలో భాగంగా ఆలయం వద్ద బాలపోతురాజు విన్యాసాలు చేస్తూ అందరినీ అలరించాడు.రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టకు చెందిన అక్షిత్ అనే బాలపోతురాజు ఆలయం వద్ద ప్రత్యేక ఆకర్షణగా మారాడు.చిన్న వయస్సులో పోతురాజు వేషంతో విన్యాసాలు చేసిన అక్షిత్‌ను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

**జేబు దొంగల చేతివాటం....**

భక్తులు అమ్మ వారి బోనాల జాతరలో నిమగ్నమై ఉంటే జేబుదొంగలు మాత్రం తమ చేతి వాటాన్ని ప్రదర్శించారు.భక్తుల రద్దీని గమనించిన జేబు దొంగలు,చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. ఆలయ పరిధిలో భక్తులు,క్యూలైన్లలో ఉన్న వారి నుంచి సెల్‌ఫోన్లు,బంగారు ఆభరణాలు,వాహనాలను అపహరించారు.భక్తులకు చెందిన ఆరుతులాల బంగారం,20కి పైగా సెల్‌ఫోన్లు,రెండు ద్విచక్ర వాహనాలను దుండగులు ఎత్తుకెళ్లారు.ఫలాహారం బండ్ల ఊరేగింపు సమయంలో తమ సెల్‌ఫోన్లు అవహరణకు గురయ్యాయంటూ బాధితులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసారు.బోనాల విధులలో పాల్గొనేందుకు వచ్చిన ఓ ఎస్పైకి చెందిన బైకును సైతం అపహరించారు.

**బోనాల విజయ వంతంలో అధికార యంత్రాంగం సహకారంపై కృతజ్ఞతలు : మంత్రి పొన్నం.**

జంట నగరాల పరిధిలో జరిగిన బోనాలు విజయవంతంలో అధికార యంత్రాంగం సహకారంపై హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధికారులకు ధన్యవాదాలు తెలియజేసారు.బోనాల విజయవంతంలో దేవాదాయశాఖ, పోలీసు,ట్రాఫిక్, అగ్నిమాపకశాఖ, జీహెచ్ఎంసీ,విద్యుత్ తదితర శాఖల అధికారుల సహకారంతో పాటు ప్రజల సహకారం కూడా తోడవడంతో విజయవంతం అయిందని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాలకు నిధుల పెంపుదల చేసినట్లు తెలియజేసారు.బోనాల జాతరకు ముందుగానే ఆయా ఆలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం పూర్తి చేసామన్నారు. సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో సోమవారం జరిగిన రంగం (భవిష్యవాణి) కార్యక్రమంలో అమ్మ వారు రాష్ట్రంలో పాడిపంటలు పుష్కలంగా పండుతాయని,రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆశీర్వదించారని,వ్యవసాయ రంగంలో మందుల వాడకాన్ని తగ్గించినట్లైతే రోగాలు లేకుండా ఉంటాయని తెలియజేసారని మంత్రి పొన్నం తెలిపారు.జులై 28న లాల్ దర్వాజ బోనాలు జరుగుతాయన్నారు.ఆషాడమాస బోనాలు అంగ రంగ వైభవంగా ప్రారంభమై ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు.గొల్కొండ బోనాలు,బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం,సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ బోనాలు,రంగం,అంబారీ పై అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమాలు ఎంతో ప్రశాంతంగా జరిగాయని, సహకరించిన ప్రజలకు మంత్రి పొన్నం ధన్యవాదాలు తెలియజేసారు.

మంత్రి వెంట హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,సనత్‌నగర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ,పవన్‌ఖేరా ఆలయ అధికారులు ఉన్నారు.

హైదరాబాద్ వార్త



# ఖజానా ఖాళీ ...బడ్జెట్‌పై ఆశలు

**-నిధుల కోసం జిహెచ్ఎంసి ఎదురుచూపులు**
**-గత అసెంబ్లీలో 1100కోట్లు ప్రకటించిన ప్రభుత్వం**
**-నాలుగు దఫాలుగా ఇస్తామన్నా ..ఒక్కకిస్తీ కూడా చెల్లించని వైనం**
**-కోట్లల్లో పేరుకుపోయిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల ప్రాపర్టీ టాక్స్**




**హైదరాబాద్,జూలై 23,ప్రభాతవార్త:**

గ్రేటర్‌లోని కోటిన్నర ప్రజలకు అత్యవసరమైన సేవలందించే జిహెచ్ఎంసి ఖజానా కాళీ అయ్యింది. ఇప్పటికే గత సర్కారు అమలు చేసిన ఎస్ఎన్‌డిపి, ఎస్ఆర్‌డిపి ,సిఆర్ఎంసి వంటి అభివద్ధి పనులకు రూ.6,530కోట్ల అప్పులు చేసిన బల్దియా ఇకపై ప్రతికార్యకలాపాన్ని సాగించేందుకు సర్కారుపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొద్దినెలల క్రితం వరకు చేసిన అప్పులు మిత్తీలు చెల్లిస్తూ కాలం గడిపిన జిహెచ్ఎసి ప్రస్తుతం తీసుకున్న అప్పు మొత్తంలో నెలనెలా కొంత ఆసలును సైతం చెల్లించాల్సి వస్తుంది. జిహెచ్ఎంసికి రోజువారీ ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ ,భవన నిర్మాణ అనుమతులు ద్వారా నిధులు వస్తున్నా ,..అవన్నీ అప్పులకు సంబంధించిన అసలు, మిత్తీలు చెల్లించేందుకు పరిమితమవుతన్నాయి. అసలు మిత్తీలు కలిపి జిహెచ్ఎంసికి ప్రతినెలా సుమారు వందకోట్లు చెల్లిస్తుంది. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ల కింద నిధులు కేటాయిస్తే తప్పా బల్దియా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. మరోవైపు గతేడాది మే నెలనుంచి కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించి రూ.1350కోట్ల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర అవిర్భావం నుంచి సీటీలో ఉన్న రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు చెందిన ఆస్తులకు సంబంధించిన ప్రాపర్టీ టాక్స్ చెల్లించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సైతం పదేళ్లనుంచి ప్రాపర్టీ టాక్స్‌ను చెల్లించకుండా బాధ్యతారహితంగా వ్యవరించడాన్ని జిహెచ్ఎంసిలోని కొంతమంది అధికారులే తప్పుబడుతున్నారు. బకాయిలు వేల కోట్లలో పేరుపోయినా చెల్లించట్లేదని ,దీనికి తోడు జిహెచ్ఎంసి పరిధిలో వసూలు చేస్తున్న ప్రొఫెసనల్ ట్యాక్స్,మోటార్ టాక్స్‌తోపాటు స్టాంప్‌డ్యూటీ వసూళ్లలో జిహెచ్ఎంసికి రావాల్సిన వాటాను సైతం చెల్లించట్లేదని తెలుస్తుంది.

**1100కోట్లు ప్రకటించినా ..ఒక్కకిస్తీ ఇవ్వలేదు**

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత జిహెచ్ఎంసిని ఆదుకుంటుందున్న నమ్మకం అధికారుల్లో కలిగింది. కానీ పాతసర్కారు వ్యవహరించిన విధంగానే కొత్తసర్కార్ వ్యవహరిస్తుందన్న విమర్శలు సైతం లేకపోలేదు. జిహెచ్ఎంసి అందిస్తున్న సేవలు, ప్రజాసమస్యలు, ఆర్థిక సంక్షభాన్ని గుర్తించి గతఅసెంబ్లీ సమావేశంలో జిహెచ్ఎంసికి 1100 కోట్ల కేటాయిస్తున్నట్లు సర్కారు ప్రకటించింది. దీన్ని నాలుకిస్తీలల్లో చెల్లిస్తామని చెప్పింది. అయిన ప్పటికీ ఈప్రకనటన చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు జిహెచ్ఎంసికి చిల్లిగవ్వకూడా చెల్లించలేదని సమాచారం. తాజాగా మంత్రితో జరిగిన సమావేశంలో జిహెచ్ఎంసి అధికారులు ప్రాపర్టీ టాక్స్ బకాయిలు, ప్రొపెషనల్ టాక్స్, మోటార్ వెయికిల్ టాక్స్‌తోపాటు స్టాంప్‌డ్యూటీ వసూళ్లలో రావాల్సిన వాటాను ప్రస్తావించినట్లు సమాచారం. అలాగే జిహెచ్ఎంసి తన ఆదాయ వనరుల పెంపుకు కొత్త కొత్త మార్గాలు వెతుకుతుంది. ప్రధానంగా కమర్షియల్ కరెంట్ మీటర్లు వినియోగిస్తూ రెసిడెన్షియల్ ప్రాపర్టీ టాక్స్ చెల్లిస్తున్న వినియోగదారులను గుర్తించి వారికి కమర్షియల్ ప్రాపర్టీ టాక్స్ వర్తింపజేయడం కోసం సుమారు 19లక్షల పైచిలుకు ఆస్తులను జిఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ )ద్వారా డ్రోన్‌లతో సర్వే చేసే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టారు.

**జిహెచ్ఎంసి అప్పులు ..ప్రభుత్వం నుంచి రావాల్సిన చెల్లింపులు**

ఎన్ఆర్‌డిపి రూ.3,755 కోట్లు, బాండ్లతో రూ.495కోట్లు, సిఆర్ఎంపి రూ.1460కోట్లు, ఎస్ఎన్‌డిపి రూ.680కోట్లు, హడ్కోనుంచి రుణంగా రూ.140కోట్లుతో మొత్తం 6530కోట్లు అప్పులు చేసింది. అలాగే ఏటా ప్రభుత్వం జిహెచ్ఎంసికి ప్రొఫెషనల్ టాక్స్ రూ.300కోట్లు, ప్రాపర్టీ టాక్స్ రూ.107కోట్లు, మ్యూటేషన్ 175కోట్లు, స్టాంప్‌డ్యూటీ రూ.2,950రావాల్సి ఉంది.

# ఉద్యోగం ఇప్పిస్తామని రూ.19.50లక్షలు వసూలు

**-నకిలీ అపాయింట్మెంట్ లెటర్ ఇచ్చి మోసం**
**-బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు**

**ఎల్.బి.నగర్, జూలై 22 ప్రభాతవార్త:** విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.19.50లక్షలు తీసుకొని నకిలీ అపాయింట్మెంట్ లెటర్ ఇచ్చి ఓ యువతని మోసం చేశాడు. యువతితో స్నేహంగా ఉంటూ ఆమెను నమ్మబలికిన విద్యుత్‌శాఖ జూనియర్ అసిస్టెంట్ నకిలీ అపాయింట్మెంట్ లెటర్ ఇచ్చాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ మమతానగర్‌కాలనీలో నివాసం ఉండే ఎన్. శ్రావణి ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపర్ అవుతోంది. ఆమె కుటుంబ స్నేహితుల ద్వారా టిఎస్ఎస్‌పిడిసిఎల్ బోనగిరిలోని విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఘట్‌కేసర్‌కు చెందిన బండారపు కిరణ్‌కుమార్ 2021లో శ్రావణికి పరిచయమయ్యాడు. విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని శ్రావణి వద్ద గత మూడు సంవత్సరాలుగా రూ.19.50 లక్షల నగదు తీసుకున్నాడు. మూడు సంవత్సరాలుగా ఉద్యోగానికి సంబంధించి ఎన్నిసార్లు అడిగినా కిరణ్‌కుమార్ దాటవేస్తున్నడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ కూడా పెట్టారు. దీంతో అప్రమత్తమైన కిరణ్‌కుమార్ విద్యుత్‌శాఖలో ఉద్యోగం వచ్చిందని ఆమెకు అపాయింట్మెంట్ లెటర్ ఇచ్చాడు. ఆ లెటర్ తీసుకొని విచారణ జరపగా అది నకిలీ అపాయింట్మెంట్ లెటర్ అని తేలింది. ఈ విషయమై కిరణ్‌కుమార్‌ని నిలదీసి తన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరడంతో అతను నిరాకరించాడు. దీంతో ఈ విషయం పెద్దమనుషుల మధ్యకు వెళ్లగా పెద్దల నిర్ణయం మేరకు 6 నెలలకు డబ్బులు ఇస్తానని కిరణ్‌కుమార్ ఒప్పుకున్నాడు. ఆరు నెలల అనంతరం డబ్బులు ఇవ్వాలని శ్రావణి కోరడంతో ఆమెను బెదిరించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన బాధితురాలు శ్రావణి తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి మోసం చేసిన కిరణ్‌కుమార్‌పై నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కిరణ్‌కుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## జోరా పబ్‌పై నార్కోటిక్ బ్యూరో పోలీసులు దాడులు..

**11 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారించిన పోలీసులు..**

**పంజగుట్ట, జూలై 22 (ప్రభాతవార్త):**

జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ పబ్‌లో నార్కోటిక్ బ్యూరో పోలీసులు ఆకస్మిక దాడి చేయడంతో పదకొండు మంది డ్రగ్స్ సేవించినట్లు ఆధారాలు లభించాయి. వివరాల ప్రకారం ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో గల జోరపబ్బులో ఓ ప్రైవేటు పార్టీ జరుగుతుంది.విశ్వసనీయ సమాచారం మేరకు ఈవెంట్‌లో మత్తు పదార్థాలు సేవిస్తున్నారని పోలీసులకు సమాచారం ఉంది. దీంతో పార్టీలో పాల్గొన్న వారి నమూనాలను సేకరించగా వారిలో పదకొండు మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు.పాజిటివ్ వచ్చిన పదకొండు మందిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

## బైక్ స్కిడ్ ...ఒకరు మృతి

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** భారీ వర్షం వల్ల సంభవించిన రోడ్డు ప్రమాదంలో మరో నిండు ప్రాణం బలైపోయింది. ఖైరతాబాద్ ప్లైఓవర్ మీద వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. భారీ వర్షం వల్ల ఈ రోడ్డు ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. వివరాల్లోకెళితే, సోమవారం ఖైరతాబాద్ ప్లైఓవర్ మీద ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నెక్లెస్‌రోడ్డు వైపు వెళ్ళే మార్గంలో బైక్ స్కిడ్ అయింది. ప్లైఓవర్ మీద రోడ్డు వర్షానికి తడిసి ఉండడం వల్ల బైక్ జారి అదుపుతప్పి కింద పడి ఇద్దరినీ ఈడ్చుకుంటూ కొంత దూరం లాక్కుపోయింది. ఈ క్రమంలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాధితులిద్దరూ ఉత్తర ప్రదేశ్‌కు చెందినవారిగా గుర్తించారు.

# బల్కంపేట్ ఎల్లమ్మ పోచమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ..

**సంజీవరెడ్డి నగర్, జూలై 22, ప్రభాతవార్త**



భక్తులకు నేడు శాకాంబరిదేవిగా దర్శనమివ్వనున్న ఎల్లమ్మ పోచమ్మ తల్లి

బల్కంపేట్ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలోని మూలవిరాట్ అమ్మవారిని ఆషాడమాసం మూడవ మంగళవారం సందర్భంగా నేడు శ్రీ అమ్మవారికి శాకాంబరి దేవిగా అలంకరణ చేయనున్న సందర్భంగా ఉదయం 4 గంటల అబిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేయబడుచున్నందున భక్తులకు ఉదయం 7 గంటలకు శ్రీ అమ్మవారి దర్శనము కల్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు ఈ విషయంలో దేవస్థానమునకు సహకరించి శ్రీ ఎల్లమ్మ పోచమ్మవారిని దర్శించుకోవలసినదిగా ఆలయ ఈవో అంజనీ దేవి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ కుమార్‌లు తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ అభివృద్ధి

**-మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాశనసభ బడ్జెట్ సమావేశాల్లోపు హైదరాబాద్ అభివృద్ధికి కావల్సిన అవసరాలు, పెండింగ్ బిల్లులు, నగరంలో ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతి తదితర ముఖ్య అంశాలపై నగర ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించాలన్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నగరానికి సంబంధించిన లా ఎండ్ ఆర్డర్, వాటర్ వర్క్స్, విద్యుత్, విద్యా, వైద్యం తదితర డిపార్ట్ మెంట్లలోని వివిధ అంశాలని సంబంధిత అధికారులతో చర్చించారు. నగర పరిధిలో పలు నియోజక వర్గాల్లో ఉన్న సమస్యలను వివరించాలన్నారు. ఈ క్రమంలో పరిశుభ్రతకు సంబంధించిన తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పరిశుభ్రత విషయంలో వాటర్ వర్క్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు, తాగు నీటి సమస్య లేకుండా చూడాలని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా డ్రగ్స్ రహిత నగరంగా హైదరాబాదును మార్చుకోవాలని, అందుకు గానూ ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డిని నగరంలో లా ఎండ్ ఆర్డర్, ట్రాఫిక్ సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, గురుకులాల్లోనూ, హాస్టళ్ళలోనూ ఉన్న పెండింగ్ పనులతో పాటు వివిధ సౌకర్యాలపై, డ్రగ్స్‌పై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. అన్నిటినీ క్రోడీకరించి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగేలా అభివృద్ధిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆమ్రాపాలి, ట్రాఫిక్ అడిషనల్ కమీషనర్ టీజీ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ వరంగల్ రహదారికి తాత్కాలిక మరమ్మతులు

**-వార్త ప్రభావం**



ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టిన అధికారులు దృశ్యం

**ఉప్పల్, జూలై 22 ప్రభాతవార్త :**

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి అధ్వాన్నంగా తయారైన విషయంపై 'వార్త' దినపత్రికలో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఎల్‌బినగర్ జోనల్ ఎస్ఇ అశోక్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, ప్రాజెక్ట్ మేనేజర్ మల్లికార్జున్, డిఇ నిఖిల్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి, సూర్యనాయక్ తదితరులు వరంగల్ జాతీయ రహదారిని సందర్శించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఉప్పల్ రింగ్‌రోడ్డు నుంచి నల్ల చెరువు వరకు రోడ్డుకు ఇరువైపులా గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపటినట్లు ఎస్ఇ అశోక్‌రెడ్డి, ఇఇ నాగేందర్ తెలిపారు. వర్షం నీరు వెళ్లేందుకు సుమారు 5లక్షల లీటర్ల కెపాసిటితో ఉప్పల్ సబ్ స్టేషన్ వద్ద ప్రత్యేక వర్షం నీటి గుంత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఆటోమెటిక్ పంపింగ్ ద్వారా నీటిని బయటకు తరలిస్తామని తెలిపారు. కారిడార్ పనులు కూడా త్వరలోనే టెండర్లు పిలిచి కొత్త కాంట్రాక్టర్ ద్వారా చేపడుతామని తెలిపారు. ఉప్పల్ నల్ల చెరువు నుంచి రింగ్‌రోడ్ వరకు రోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నామని వారు తెలిపారు. రహదారిలో మట్టి వేసి గుంతలు పూడ్చడంతోపాటు వర్షాలు తగ్గిన తర్వాత కొత్త రోడ్డు కూడా వేస్తామని తెలిపారు. జాతీయ రహదారిలో వాహనదారులకు ఇబ్బంది లేకుండా తమ వంతు సహకారం అందిస్తున్నామని ట్రాఫిక్ సిఐ లక్ష్మిమాధవి తెలిపారు.

అధ్వాన్నంగా తయారైన రహదారి విషయాన్ని వెలుగులోకి తెచ్చిన వార్తకు స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# దోమల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టండి

**విషజ్వరాలు ప్రభలకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలి**
**అధికారులకు కమిషనర్ అమ్రపాలి ఆదేశం**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అమ్రపాలి తదితరులు

**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:**

నగరంలో దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టి వ్యాధుల ప్రబలకుండా కట్టుదిట్టమైన జానరగత్తలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట సంబంధిత అధికారలకు అదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ అమ్రపాలి జోనల్ కమిషనర్లు , అదనపు కమిషనర్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలుఅంశాలపై దిశానిర్దేశం చేశారు. దోమలు వృద్ధిచెందకుండా దోమల ఉత్పత్తి ప్రదేశాలల్లో గంబూజియా, అయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. దోమల నివారణ ప్రతిశుక్రవారం డ్రైడేగా పాటించాలని, వర్షాకాలంలో డెంగ్యూ, చికెన్ గున్యా ,టైఫాయిడ్ ,డయోరియా , విష జ్వరాలు లాంటి సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్యసేవలు అందించాలని, ఎక్కడైనా మలేరియా ,డయోరియా ,డెంగ్యూ వంటి వ్యాధి సోకితే అలాంటి ప్రాంతాలల్లో విస్తృత స్థాయి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా శానిటేషన్ సవ్యంగా జరిగేలా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. అన్నపూర్ణ భోజన కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కమ్యూనిటీ మరమ్మత్తులు ,కనీస వసతుల కల్పనను ప్రతపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సర్కిళ్ల వారీగా కమ్యూనిటీ హాల్స్ వివరాలు సేకరించి అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే సినిమా హాల్స్ వద్దపార్కింగ్ ఫీ వసూళ్లపై తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**ప్రజావాణి విజ్ఞప్తులను సత్వరగా పరిష్కరించాలి : కమిషనర్ అమ్రపాలి**

ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అధికారులు ఆదేశించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ అమ్రపాలి గ్రేటర్ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ఒకొక్కరి సమస్యను వింటూ విజ్ఞప్తులు స్వీరించారు. ఈసందర్భంగా ప్రజావాణికి వచ్చిన కొందరు ఆర్జీదారులు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని కోరగా..జిహెచ్ఎంసి పరిధిలో ఇండ్లు కట్టి ఇచ్చే బాధ్యత మాత్రమేనని అట్టి ఇళ్లను లబ్దిదారులకు కేటాయించేది జిల్లా కలెక్టర్ అని ఆర్జీదారులకు వివరించారు. మొత్తం 31విన్నపాలురాగా, టెలిఫోన్ ద్వారా మరో 11 వచ్చినట్లు తెలిపారు.

## పేదలకు వరం సిఎం సహాయనిధి : ప్రకాష్ గౌడ్



బండ్లగూడ కార్పోరేషన్‌లో అర్హులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జూలై 22 ప్రభాతవార్త :** సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంగా మారిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ పరిధిలోని హిమాయత్ సాగర్‌కు చెందిన బాలు నాయక్‌కు రూ.25,వేలు, పీరంచెరువుకు చెందిన నజీర్‌కు రూ.54.వేలు, ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలమణికి రూ.25.వేల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిషలు కృషి చేస్తున్నార న్నారు. ముఖ్యంగా పెద్ద రోగాలు వచ్చి కార్పోరేట్ వైద్యంకు వెళ్లిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చాలా ఉపయుక్తంగా మారిందన్నారు. ఈ సిఎం నిధి వలన చాలా మంది పేదలు సకాలంలో వైద్యంను పొంది ప్రాణాలతో బటయ పడుతున్నారన్నారు. పేదల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేష్‌గౌడ్, రాజు, రజాక్, సాధిక్, శ్రీనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని వినతి

**నార్సింగి, జూలై 22 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని 20.వ,వార్డులో కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతూ కార్పోరేటర్ సాగర్‌గౌడ్ గండిపేట్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరికి ఉపయోగపడేలా అన్ని వసతులతో కూడిన కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కౌన్సిల్‌లో తీర్మాణం చేసి, నిధులు మంజూరు చేశామని తెలిపారు. ఈ తీర్మాణం కాపీని గతంలోనే మున్సిపల్ కమీషనర్ తహసీల్దార్ కార్యాలయంకు పంపించారని, ఇది జరిగి నెలలు గడిచినా స్థలం కేటాయించ లేదన్నారు. స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మరోమారు తహసీల్దార్‌ను వినతిపత్రం ఇచ్చి కోరామని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మితమయితే స్థానికులకు శుభకార్యాలు చేసుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ భూమి కూడా ఈ వార్డులో అందుబాటులో ఉందని, దాన్ని ఓ సారి పరిశీలించి కేటాయించాలని తహసీల్దార్‌ను కోరామని, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని కార్పోరేటర్ సాగర్‌గౌడ్ తెలిపారు.

## ముగిసిన హైదరాబాద్ సూపర్ లీగ్ పుట్‌బాల్ టోర్నీ

### -విజేతగా నిలిచిన వారియర్స్ ఎఫ్‌సి జట్టు



విజేతగా నిలిచిన వారియర్స్ ఎఫ్‌సి జట్టు

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సి ఆధ్వర్యంలోని హైదరాబాద్ సూపర్‌లీగ్ సబ్ జూనియర్ సీజన్2 ఉత్తేజకరమైన వాతావరణంలో ముగించింది. లియో11 వేదికగా జూన్ 9నుంచి జరిగిన ఈటోర్నిలో ఎనిమిది జట్లు పాల్గొన్ని ఉత్కంఠబరితమైన పోటీని కొనసాగించాయి. ఫైనల్ మ్యాచ్‌లో మమ్మాద్ అమన్ అలం ఆధ్వర్యంలోని వారియర్స్ ఎఫ్‌సి ఉత్తమ ప్రదర్శనతో 1-0 గెలుపొంది టోర్నీ విజేతగా నిలిచింది. ఎఫ్‌సి క్రీడాకారుడు కషీఫ్ చేసిన నిర్ణాయాత్మక గోల్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. హైదరాబాద్ లిటిల్ స్టార్స్ సాకర్ అకాడమీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈలీగ్ ఉత్కంత భరితమైన వినోదాన్ని అందించడమే కాకుండా పుట్‌బాల్‌లో యువత ఆసక్తి -అభివృద్దిని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ సూపర్‌లీఆగ్ వ్యవస్థాపకుడు మొహమ్మద్ ఫైజ్‌ఖాన్ ఆధ్వర్యంలోని లీగ్‌కు ప్రోత్సాహకరమైన మద్దతు లభించింది. అలాగే శ్రీనిధి డెక్కన్, డెక్లాథాన్, ఇండియా ఖేలోపుట్‌బాల్‌కు చెందిన ప్రముఖల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈనేపథ్యంలో పుట్‌బాల్ కమ్యూనిటీలో హైదరాబాద్ సూపర్‌లీగ్ ప్రాముఖ్యత మరింత పెరిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

### -డిఎస్‌డి జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

**చిక్కడపల్లి, జూలై 22 ప్రభాతవార్త:** వికలాంగులను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఐఏఎస్ అధికారి స్మిత సభర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్‌డి) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కోకన్వీనర్ కాటమోని వెంకటేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఒక బాధ్యతయుతమైన పదవిలో ఉన్న ఐఏఎస్ అధికారి స్మిత సభర్వాల్ వికలాంగులను కించపరిచే విధంగా పెట్టిన పోస్టులు 2016 ఆర్‌పిడబ్ల్యుడి చట్టంలో పేర్కొన్న సమానత్వం, వికలాంగుల పట్ల వివక్షతకు పూర్తి భిన్నమైందని, వికలాంగులను కించపరిచే విధంగా పోస్టు చేసిన అధికారిపై ఆర్‌పిడబ్ల్యుడి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా హైదరాబాద్ గ్రూప్ 'తల్ సేనా క్యాంప్'

**చిక్కడపల్లి, జూలై 22 ప్రభాతవార్త:** ఎన్‌సిసి తెలంగాణ బెటాలియన్ నుంచి పదిహేను మంది కెడెట్లు ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్‌లో హైదరాబాద్ గ్రూప్ 'తల్ సేనా క్యాంప్' ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. ఈ సందర్భంగా సోమవారం పోటీలలో పాల్గొని విజయవంతంగా తిరిగి వచ్చిన ఎన్‌సిసి కెడెట్లను సికింద్రాబాద్ ఎన్‌సిసి బెటాలియన్ క్యాంప్‌లో ఘనంగా సత్కరించారు. తెలంగాణ బెటాలియన్‌లో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఇంటర్ విద్యార్థి బి.వంశీ సాగర్ హైరాబాద్ జట్టు గెలవడానికి తనవంతు పాత్ర పోషించిన సందర్భంగా కళాశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. తల్‌సేనా క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ప్రసూనాన్ధ్ నేతృత్వంలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలువడం సాధ్యమైందని కళాశాల ఎన్‌సిసి విభాగం అధికారి ఎం.కిరణ్‌కుమార్, ఆర్మీ సిబ్బంది అభినందించారు. ఈ పోటీలలో పలువురు ఎన్‌సిసి కెడెట్లు వ్యక్తిగతంగా బంగారు పతకాలను గెలుపొందారు. సత్కారం పొందిన వారిలో ఎన్‌సిసి కెడెట్లు తిరుచునాపల్లిలో జె.మనోజ్ కుమార్(ఫైరింగ్ కాంపిటిసన్), అనంతపురంలో బి.వంశీ సాగర్, సి.భార్గవి(తల్‌సైనిక్ క్యాంప్) లను జ్ఞాపికలను బహుకరించి సత్కరించారు.

## అడ్డంగా బుకై పేకాట రాయుళ్లు..

**కొంపల్లి, జూలై 22, ప్రభాతవార్త :** నిజాంపేట్ హెచ్.పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఓ రియల్ ఎస్టేట్ ఆఫీసులో కొంత మంది వ్యక్తులు ఆదివారం రాత్రి 9గంటల సమయంలో బెట్టింగ్ పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారంతో సబ్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, కానిస్టేబుల్స్ వీరారెడ్డి, అశోక్ సంఘటన స్థలాన్ని చేరు కొని వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కోటపాటి రమేష్ (52), రవి శ్రీనివాసరావు (52), శబ్బాని కిషోర్ (36), కె.దుర్గా రాజశేఖర్ (40), కె.ధర్మ (52), ఎస్.కిరణ్ (30), వసంత విజయ భాస్కర్ (30)గా గర్తించి వీరి వద్ద నుండి 7 మొబైల్ ఫోన్లు, రెండు సెట్లు ప్లేయింగ్ కార్డ్స్ అలాగే నదగు రూ.12320 స్వాధీనం చేసుకొని వారిని అక్కడ నుంచి బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి స్టేషన్ హౌస్ ఆఫీసర్ ముందు హాజర్ పరిచారు. ఏడుగురిని విచారించగా ఈజీ మనీ కోసమే వాళ్లు బెట్టింగ్ గేమ్‌లు ఆడుతున్నట్టు అంగీకరించడంతో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ రావు తెలిపారు.

# సరదా ఫీట్లు, తెస్తున్న పాట్లు

## -బైక్ స్టంట్లతో ఆరాటం., ప్రాణాలతో చెలగాటం

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** అర్ధరాత్రి సమయాల్లో హైదరాబాద్ యువత కొత్త కొత్త ఫీట్లు చేస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఒకానొక సందర్భంలో బెట్ ఫైట్లు, స్ట్రీట్ ఫైట్లకు ఎడబడిన యువత పోలీసుల కట్టడి వల్ల బైక్‌లపై సాహసాలు చేస్తూ, ర్యాష్ డ్రైవింగులతో రేసింగులకు పాల్పడుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఖాళీగా ఉన్న రోడ్లపై సరదాగా రౌండు వేద్దామని మితిమీరిన వేగంతో బైక్‌లు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రకరకాల బైక్ స్టంట్లను వీడియోలు తీసి సోషల్ మీడియాలో రీల్స్‌గా అప్లోడ్ చేస్తూ తమ చేష్టలకు అడ్డూ అదుపూ లేకుండా చెలరేగుతున్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడమే కాకుండా మద్యం తాగి వాహనాలు నడపడంపై పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసినప్పటికీ కొందరు ఆకతాయిలు రాత్రి పగలు తెడా లేకుండా బైక్ విన్యాసాలు చేస్తూ రోడ్డుపై వెళ్తున్న ఇతర వాహనదారులను అదుపు తప్పేలా చేసి భయాందోళనలకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా వారాంతరాల్లో లాంగ్ డ్రైవ్‌లు, నైట్ రైడ్‌లు ఎక్కువైనట్లు ట్రాఫిక్ నిపుణుల సమాచారం. తాజాగా బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపించిన నేపథ్యంలో రోడ్లపై వర్షంలో బైక్ స్టంట్లు చేస్తూ నగరానికి చెందిన కొందరు యువకులు ప్రాణాలమీదకి తెచ్చుకున్నారు.

**ఆగని బైక్ సాహసాలు:**

రేసింగ్ పేరుతో అతివేగంగా ర్యాష్ డ్రైవింగ్ చేయడం వల్ల, రాంగ్ సైడ్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంపింగ్ తదితర చర్యల వల్ల పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని మినిస్ట్రీ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ వెల్లడించింది. గతేడాది 2023లో 2,312 రోడ్డు ప్రమాదాలు జరుగగా, వంద కంటే ఎక్కువ మరణాలు నమోదయ్యాయని తెలిపింది. ఈ సంఖ్య 2024 సంవత్సరానికి గానూ పెరిగే అవకాశం ఉందని ట్రాన్స్‌పోర్ట్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అర్ధరాత్రుళ్ళు బైక్ స్టంట్లు చేయడంపై, జనసందోహం ఉన్న జంక్షన్లలో బైక్‌లపై సాహసాలు చేయడంపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు సామాజిక వేదికలపై పోలీసు యంత్రాంగం అధికారిక ఖాతాలు లింక్ చేసి మరీ స్పందిస్తున్నారు. ఇటీవలె రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఉండగానే, వాహనాల రాకపోకల మధ్య బైకులపై కొందరు ఆకతాయిలు ముందు టైరు పైకి లేపి బైక్‌ను దూకిస్తూ, ఒక సర్కిల్‌లో స్కిడ్ చేయిస్తూ నానా హంగామా చేశారు. ఆ దృశ్యాలు సిసి కెమేరాలతో పాటు పలువురు చారవాణులతో తీసిన వీడియోల్లో కూడా బంధింపబడడంతో నెట్టింట దుమారం రేపాయి. తాజాగా వర్షంలో బైక్ స్టంట్లు చేయాలనే ఆలోచన చేసినందువల్ల నగర యువకుల పాలిట వాయుగుండం పొంచి ఉన్న ప్రమాదంలా మారింది. శనివారం రోజంతా వర్షం పడుతూనే ఉన్న సమయంలో హైదరాబాద్ శివార్లలోని హయత్‌నగర్ ప్రాంతంలో నలుగురు యువకులు బైక్ స్టంట్లు చేయగా ద్విచక్ర వాహనం పట్టుతప్పడం వల్ల ప్రమాదం సంభవించింది. హైదరాబాద్ నుండి విజయవాడ హైవేపై జన సంచారం ఉన్న రోడ్డు మీదు బైక్ ముందు టైరుని పైకి లేపి దూకిస్తుండగా, రోడ్డు తడిసి ఉండడం వల్ల బైక్‌ను రైడర్ నియంత్రించలేకపోయాడు. అదుపుతప్పిన బైక్ స్కిడ్ అయి కింద పడి ఈడ్చుకుంటూ కొంత దూరం లాక్కుపోయింది. ఈ ప్రమాదం పూర్తిగా బాధిత యువకుల నిర్లక్ష్యం వల్లే జరిగినట్టు హయత్ నగర్ పోలీసులు తెలిపారు. ఇటువంటి ప్రమాదాలను ఉదాహరిస్తూ బైక్ స్టంట్లకు దూరంగా ఉండమని పోలీసులు హెచ్చరించారు. బంజారాహిల్స్, మెహిదీ పట్నం, హైటెక్ సిటీ, ఐకియా, గచ్చిబౌలి, రాయదుర్గం, కేబుల్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో ఉన్న విశాలమైన రోడ్లు అర్ధరాత్రి సమయాల్లో ఖాళీగా ఉండడం వల్ల, అక్కడ బైక్ స్టంట్లు విరివిగా చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వారాంతరాల్లోని పలు సందర్భాల్లో రాయదుర్గం ఐటీ కారిడార్ ప్రాంతంలో భారీగా బైక్ రేసింగులు జరగడంతో ట్రాఫిక్ అధికారులు అప్రమత్తమయ్యారు.

**ఎక్కడికక్కడ నిర్మూలిస్తున్నా, దూసుకుపోతున్నారు:**

నగరంలోని రాత్రివేళ జరిగే బైక్ రేసింగుల్లోనూ, ఫీట్లలోనూ ఎక్కువగా 500సిసి, 800 సిసి, 1000 సిసి వంటి పికప్ ఎక్కువున్న బైకులనే వాడతారని, ఈ క్రమంలో తాము దొరక్కుండా ఉండేందుకు చాలా వరకూ నెంబర్ ప్లేట్లను ఉపయోగించరని నగర ట్రాఫిక్ అధికారులు చెబుతున్నారు. రాయదుర్గం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సి.హెచ్ వెంకన్న మాట్లాడుతూ... పట్టుబడిన నిందితుల తల్లిదండ్రులను పిలిపించి వారి ముందే బైక్ సాహసాల వల్ల కలిగే తీవ్ర పరిణామాలైన ట్రాఫిక్ ప్రమాదాలపై, పడే శిక్షలపై పోలీసు బృందాలు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. నెలలో ప్రతి శుక్ర, శనివారాల్లో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీసు బృందాల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

## మూసీలో పేరుకుపోతున్న చెత్తను తొలగించాలి

### - ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హజ్రీ

**మెహిదీపట్నం, జూలై 22, ప్రభాతవార్త :** మూసీలో పేరుకపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ దోమల బెడద లేకుండా చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజక వర్గ ఇంచార్జ్ ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీ అన్నారు. సోమవారం జియాగూడ పూరానాపూల్ మూసీ పరివాహక ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉస్మాన్‌బిన్ మాట్లాడుతూ మూసీని డంపింగ్ యార్డుగా మార్చడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. బస్తీలు, కాలనీలలోని వేస్ట్ మెటల్ తీసుకువచ్చి మూసీలో పడవేయడంతో మూసీ కుచించుకు పోవడంతో పాటు ఆక్రమణలకు గురవుతుందన్నారు. మూసీని కబ్జా చేసే వారిపై జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మూసీని ఆనుకొని డంపింగ్ యార్డు ఉండడంతో జియాగూడ డివిజన్ దోమల కర్మాగారంగా మారిందన్నారు. డంపింగ్ యార్డు లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ఆయన వెంట నాయకులు వినోద్ చోగ్లే, దర్శన్, పూయుష్, దుర్గాప్రసాద్, జగన్ గౌడ్, నవీన్, నర్మద, ఆనంద్, మహేష్ కుమార్, వనిత, ప్రవీణ్ చారి, సుజాత, చింటు తదితరులు ఉన్నారు.

## గిగ్, ప్లాట్‌ఫార్మ్ కార్మికులకు సామాజిక భద్రత

### - రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్



రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌ను సత్కరిస్తున్న ఝార్ఖండ్ రాష్ట్ర కార్మిక వనరుల శాఖ మంత్రి సత్యానంద్ భోగ్తా

**చిక్కడపల్లి, జూలై 22 ప్రభాతవార్త:** దేశంలోనే మొదటిసారిగా లేబర్‌కోడ్‌ల ద్వారా అసంఘటిత రంగంలోని కార్మికులతో పాటు గిగ్, ప్లాట్‌ఫార్మ్ కార్మికులకు సామాజిక భద్రతను అందించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్ అన్నారు. ముఖ్యంగా అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతా ప్రయోజనాలను కోడ్ అందిస్తుందని అన్నారు. సోమవారం ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. ఇటీవల ఝర్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో 'గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ పాలసీ'పై ఝర్ఖండ్ ప్రభుత్వం, అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ సమావేశం వివరాలు వెల్లడించారు. ఝర్ఖండ్ రాష్ట్ర కార్మిక వనరుల శాఖ మంత్రి సత్యానంద్ భోగ్తా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇ.గంగాధర్ మాట్లాడుతూ దేశంలో కార్మిక చట్టాలు 'గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్స్' గా నిర్వచించడం ఇదే మొదటిసారి అని, కోడ్ ప్రకారం అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం ప్రమాద బీమా కోసం సంక్షేమ పథకాలను రూపొందించే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని, ఇందులో వైకల్యం, జీవితభీమా కవర్ అవుతుందని అన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ కృషి



చార్మినార్ వద్ద బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాహుల్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్‌లు మిఠాయిలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చార్మినార్,జూలై 22 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నదని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సమీర్ ఉల్లా,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాహుల్‌చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్‌లు అన్నారు.రైతులకు రెండు లక్షల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేసి నందుకు చార్మినార్ వద్ద కాంగ్రెస్ నాయకులు లోక్ సభ ప్రతి పక్ష నాయకులు రాహుల్ గాంధీ,రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంతి భట్టి విక్రమార్క ఫోటోలకు పాలాభిషేకం చేశారు.అనంతరం చార్మినార్ పరిసర ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని తెలిపారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులకు రుణ మాఫీ కాలేదని,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతుల రెండు లక్షల రూపాయల రుణ మాఫీ ప్రకటించారని వారు తెలియజేశారు.వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం గుప్తా, మహ్మద్ థానీస్,అస్లాం,శ్రీధర్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సర్దార్ పాపన్న మహారాజ్ జయంతికి సెలవు ప్రకటించాలి : డా.రామారావుగౌడ్

**తార్నాక, జూలై 22 ప్రభాతవార్త:** సర్దార్ పాపన్న మహారాజ్ జయంతి రోజు సెలవు ప్రకటించాలని జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డా.వట్టికూటి రామారావుగౌడ్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉస్మాని యా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట పాపన్న గౌడ్ మహారాజ్ 374 వ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రామారావు గౌడ్ మాట్లాడుతూ 21 కోటలు నిర్మించి, 30 ఏండ్ల పరిపాలనలో ఏడున్నర నెలలు గోల్కొండను పాలించిన బహుజన చక్రవర్తి పాపన్న మహారాజ్‌కు తగిన ప్రాధాన్యతను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇవ్వాలని కోరారు. పాపన్న జయంతిని జనగాం జిల్లాను పాపన్న జిల్లాగా ప్రకటించాలని, పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిదంగా పాపన్న కోటలు శిథిలమైపోతున్నందున వీటిని పరిరక్షించాలని పాపన్న చరిత్రను సీబీఎస్ఈ సిలబస్‌గా పెట్టాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి పాపన్న మహారాజ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన పాపన్న మహారాజ్ కోసం ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించాలని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జైగౌడ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, గుండ్రాతి నారాయణగౌడ్‌లు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జైగౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునుకాంట్ల శ్రీనివాస్ గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి, శేషగాని నరేష్ గౌడ్, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు గొదగోని విమలాగౌడ్, మహిళా జాతీయ నాయకురాలు చకన అనురాధ గౌడ్, దంగోళ్ల మురళీగౌడ్, వారాగౌడ్, అంజిగౌడ్, రఘునాద్ గౌడ్, అంకెన్నగారి నాగరాజు గౌడ్, అంకెన గారా శ్రీనివాస్ గౌడ్,వెంకటరమణ గౌడ్, శంకర్ గౌడ్, కొండరాజేష్ గౌడ్, లింగారావు, మధుసూధన్ గౌడ్, బీసు వెంకటేష్ గౌడ్, స్వామీ గౌడ్, సత్యంగౌడ్, చక్రధర్ గౌడ్‌తో పాటు రెండు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమసమాజ నిర్మాణం కోసం తెలంగాణ తమిళ సంఘం తోడ్పాటు

### -తెలంగాణ తమిళ సంఘం అధ్యక్షుడు ఎంకె.బోస్

**చిక్కడపల్లి, జూలై 22 ప్రభాతవార్త:** సమసమాజ నిర్మాణం చేయడంతో పాటు సామాజికవర్గ బాధ్యతగా తెలంగాణ తమిళ సంఘం ముందుకు సాగుతోందని ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కె.బోస్, ఎస్.రాజ్ కుమార్ అన్నారు. సోమవారం రామ్‌నగర్‌లో సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరంలో గత కొన్ని దశాబ్దాల నుంచి వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న తమిళ ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు తమిళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలను తమ సంఘం నిర్వహిస్తోందని అన్నారు. కాగా సంఘం తరపున రెండు రోజుల పాటు శ్రీశైలం తదితర దేవాలయాలను సంఘం ప్రతినిధుల బృందం సందర్శించారన్నారు. సంఘం కోశాధికారి ఎన్.శాస్త్రి, సహాయ కోశాధికారి కుమారరాజన్, సంయుక్త కార్యదర్శి జగదీషన్, ఉమా గణేష్, శాంతకుమార్, ప్రభు విజయన్, మీనాక్షి సుందరం, అరుణ కుమారరాజన్, కణిశీలం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ తమిళ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంకె.బోస్, ఎస్.రాజ్‌కుమార్, కోశాధికారి శాస్త్రి తదితరులున్నారు.

## కమ్యునికేషన్, సాఫ్ట్, ఎంప్లాయబిలిటీ స్కాల్‌లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**హైదరాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** విద్యార్థినీ,విద్యార్థులు కమ్యునికేషన్, సాఫ్ట్, ఎంప్లాయబిలిటీ స్కాల్ వంటి వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'ప్రవిష్ట-2024' పేరుతో జరిగిన కార్యక్రమానికి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాంకేతికతను, అర్ధవంతంగా, తెలివిగా ఎప్పటికప్పుడు ఉపయోగించుకోవాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డాక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలోని అద్వితీయ ప్రతిభను వెలి కితీసే స్ఫూర్తిదాయకమైన కథను వివరించారు. అజా కన్సల్టింగ్ సర్వీసింగ్(ఎల్ఎల్‌పి) ఉపాధ్యక్షురాలు(హెచ్‌ఆర్) శైలజ అక్కల మట్లాడుతూ విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను కోల్పోకుం డా నిరంతరం జ్ఞానాన్ని వృత్తిచేకూర్చుకుని విద్య పై దృష్టిసారించాలన్నారు. రామకృష్ణమఠం నుంచి బ్రహ్మచారి సత్యచైతన్య స్వామీజీ మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా మార్గనిర్దేశం చేస్తూ, మానసిక ఉల్లాసంతో, చిరువదనంతో కష్టానికి వెనుదిరుగక, కఠోరదీక్షకు కలిగి ఉండాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ తదితరులు

కళాశాల ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ వీర సోమయ్య స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ డి.వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు వారి సర్వతోముఖా భివృద్ధితో వారిలో అత్యద్భుతమైన మెళకువలను మెరగుపర్చడానికి విద్యార్థులు క్రమశిక్షణతో ముం దుకు సాగాలన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, కళాశాల ఫౌండర్ ప్రెసిడెంట్, ఆంధ్ర ప్రదేశ్ పూర్వ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడు తూ పెద్దలను గౌరవిస్తూ, గొప్ప మానవ విలువల ను పెంపొందించుకోవాలన్నారు. ఉద్యోగార్థులుగా కాక, ఉద్యోగ కల్పకులుగా తయారు కవాలని కోరారు. కళాశాల డైరెక్టర్(హెచ్‌ఆర్) డాక్టర్ జయ ప్రద తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ అప్పారావు, ప్రొఫెసర్ పి.వీ రసోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోశాలను ప్రారంభించిన రాజాసింగ్

**బేగంబజార్,జూలై 22ప్రభాతవార్త:** గోశాలలను నిర్మించి గోసంరక్షణ కోసం కృషి చేయడంతో పాటు సమాజ సేవాకార్యక్రమల్లో ఆర్యవైశ్యులు, అన్ని వేళ్లలో ముందు వరుసలో ఉన్నారని గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ అన్నారు.హైదరాబాద్ ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ అద్యక్షులు నరేష్‌గుప్త, ప్రధాన కార్యదర్శి నాగార్జున గంధు,కోశాధికారి బాస్కర్ సరాబుల ఆధ్వర్యంలో రహీంపురాలోని దత్తాత్రేయ మందిరంలోనూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ గోసంరక్షణకొరకు పాటు పడటం అభినందనీయమన్నారు.ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాడిశెట్టి సదానందగుప్త మాట్లాడుతూ హైదరాబాద్ ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ వైశ్యయూత్ మాజీ అధ్యక్షులు మాద్యం సుధాకర్‌గుప్త,సంఘ సేవకులు వహెనద్ మాణిక్,ప్రాజెక్టుసలహాదారులు సతీష్ దొంతులు,వెంకటేష్‌శేరి,సందీప్‌గుప్త,సంతోష్‌సముద్రాల,బాలవంశీ,లక్ష్మన్‌దైతా,గుండా నరేష్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



గోశాలను ప్రారంభించిన శాసన సభ్యులు టి.రాజాసింగ్

## ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

**ముషీరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** సివిల్ సర్వీస్ ఉద్యోగ అవకాశాలలో దివ్యాంగుల కోటా అవసరమా అంటూ దివ్యాంగులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని వికలాంగుల మాజీ ఛైర్మన్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు డిమాండ్ చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ అధికారి అయిఉండి, వికలాంగులను చిన్న చూపు చూడటం సరికాదని అన్నారు. ఉన్నతమైన పదవిలో ఉన్న స్మితా సబర్వాల్ వికలాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటం విచారకరమని అన్నారు. వికలాంగుల మనోభావాలను కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేసిన ఆమె యావత్ వికలాంగులకు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షం పీపుల్ డిసేబుల్ యాక్ట్ సెక్షన్ 90 ప్రకారం ఆమెపై కేసు వేయటం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి నల్లెల్ల కిషోర్ మాట్లాడుతూ స్మితాసబర్వాల్ ఇంకా కేసీఆర్ ప్రభుత్వంలో చీఫ్ సెక్రటరీగా ఉన్నట్లు భ్రమ పడుతున్నారని, ప్రజలను కించపరిచే నాయకులు కానీ అధికారులు కానీ ప్రజా క్షేత్రంలో మనుగడ సాగించలేరని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రధానకార్యదర్శి పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, జి.యాదగిరిరావు, సుక్రవేది, అప్పారావు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను కూల్చిన రెవెన్యూ అధికారులు

**యూసుఫ్‌గూడ, జూలై 22, ప్రభాతవార్త**

ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని సారధినగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఓ కార్పోరేటర్ నిర్మించిన నిర్మాణాన్ని ఖైరతాబాద్ రెవెన్యూ అధికారులు సోమవారం జెసిబితో కూల్చివేశారు.సారధినగర్ సొసైటీలో ప్లాట్ నెంబర్ 30మరియు31 మధ్య 30అడుగుల వెడల్పు 90అడుగుల పొడవులో రోడ్డు ఉన్నది.అయితే ఓ కార్పోరేటర్ తన ప్లాట్‌కు ఆనుకున్న రహదారిని సైతం ఆక్రమించుకుని ప్రహరి నిర్మించి గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈవిషయమై స్థానికులు పలుమార్లు రెవెన్యూ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా స్థానికులు నియోజకవర్గం శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ దృష్టికి తీసుకువెళ్ళగా వెంటనే ఆయన స్పందించి అధికారులతో గత శనివారం ఈ అక్రమ నిర్మాణాలను పరిశీలించారు.దీని విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళగా సోమవారం రెవెన్యూ అధికారులు జెసిబి సహాయంతో కూల్చివేశారు.

## వైఎస్ఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 15ను పునరుద్దరించాలి

**మెహిదీపట్నం, జూలై 22, ప్రభాతవార్త :** ముదిరాజ్‌ల, ఆర్థిక సమాజిక స్థితిగతులను తెలుసుకొని వారి అభివృద్ధి, సంక్షేమానికి 15 సంవత్సరాల క్రితం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 15ను పునరుద్దరించాలని, ముదిరాజ్ సామాజిక వర్గంను బీసీ - డీ నుంచి బీసీ - ఏ గ్రూప్‌కు మార్చాలని కోరుతూ సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నగర అధ్యక్షులు టి. సురెందర్ ముదిరాజ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మేనిఫెస్టో, బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు జివో 15ను పునరుద్దరించాలన్నారు.ముదిరాజ్ లను బిసి డి నుంచి బిసి ఎ గ్రూప్‌లోకి మార్చడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు పొట్లకాయల వెంకటేశ్వర్, రంగ సాయన్న, ఎ. శివ, సదా, ఎ.శంకర్, రాజయ్య, సాయిలు, సింగరి సుదర్శన్, లక్ష్మీ నారాయణ, గోనెల సుదర్శన్, ఎ.శ్రీనివాస్, రవీందర్, దర్మేందర్‌లు ఉన్నారు.

## 25న స్టైల్ పితారా ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం..

**అప్జల్‌గంజ్,జూలై 22ప్రభాతవార్త:** క్రియేటివ్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో "స్టైల్ ఫితారా,"పేరిట ఈనెల 25వ తేదిన రాంకోఠిలోని కచ్చి భవన్‌లో ఫ్యాషన్,లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సంఘ సేవకురాలు భగవతి మహేష్ బల్దావ్,ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్వేత అగర్వాల్‌లు ప్రారంభిస్తారనినిర్వాహకులు రమా రాఠి,వైశాలి ఇనాని, మినాల్ సాడా,వినీత్‌బల్దవాలు తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్లో ఉంటూ వివిధ రకాల వస్తు,సామాగ్రి ప్రదర్శన,అమ్మకాలకు అవకాశం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లుతెలిపారు.ఎగ్జిబిషన్‌ను రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు.26వ తేదిన ఎగ్జిబిషన్ ముగింపు ఉంటుందన్నారు.రెండు రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌లో ఢీల్లి,ముంబై, కలకత్తా, జైపూర్‌లోపాటుదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొంటార్నారు.ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాని న్ క్రియేటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎకల విద్యాలయానికి ఆర్థిక సహాయం అంద చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖకవి యాకూబ్‌కు పరిషత్తు ప్రతిష్టాత్మక సినారె పురస్కారం

### - పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

**నాంపల్లి, జూలై 22 ప్రభాతవార్త :** తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రతీయేటా ప్రదానం చేస్తున్న ప్రతిష్టాత్మక డా. సి.నారాయణరెడ్డి సాహిత్య పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ కవి డా. యాకూబ్‌కు అందిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. జె.చెన్నయ్యలు తెలిపారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఈ నెల 27 శనివారం రాత్రి 6గంటల నుండి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి 93వ జయంతిని పురస్కరించుకొని ప్రదానం చేయనున్న ఈ పురస్కారం కింద 25వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో యాకూబ్‌ను ఘనంగా సత్కరించనున్నట్లు వారు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, శాసనమండలి సభ్యుడు ప్రజాకవి గోరటి వెంకన్న, డా. ముదిగంటి సుజాతారెడ్డి, మంత్రి రామారావు తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారని వారు తెలిపారు.

## నూతన ఎస్‌టిపి పనులను పరిశీలించిన అధికారులు..



ఎస్‌టిపి పనలును అపూర్వ చౌహాన్‌తో కలిసి పరిశీలిస్తున్న ఆమ్రపాలి

**పేట్ బషీరాబాద్, జూలై 22, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డలో నిర్మిస్తున్న నూతన ఎస్‌టిపి (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) పనులను సోమవారం జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆమ్రపాలి కాట, కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి పరిశీలించారు. ఈనెల 27వ తేదిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సదరు ఎస్‌టిపి ప్లాంటును ప్రారంభించిన నేపథ్యంలో ఎస్‌టిపి పనులతో పాటు రహదారి పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. అనంతరం పక్కనే ఉన్న ఎన్నా చెరువును సందర్శించి చెరువులోని గుర్రపు డెక్కను తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. అక్కడి నుంచి ఫతేనగర్‌లో నిర్మిస్తున్న ఎసన్టఇపి ప్లాంటును పరిశీలించేందుకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఉప కమీషనర్ వి.నరసింహ, ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ లక్ష్మీ గణేష్, ఏఎమ్ఓహెచ్ డాక్టర్ భార్గవ్ నారాయణ, పట్టణ ప్రణాళిక ఏసీపీ సాయిబాబా, డిఈలు పాపమ్మ, రఘుపతి రెడ్డి, హార్టికల్చర్ మేనేజర్ రఘువీరారెడ్డి, ఎంటమాలజీ ఏఈ ఉమారాణి, జలమండలి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెరలను తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలి



నిరాహారదీక్షలో ప్రసంగిస్తున్న శివరాత్రి అయిలమల్లు

**ధర్నాచౌక్, జూలై 22, ప్రభాతవార్త:** రాహుల్‌గాంధీ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం వడ్డెరలను తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలని తెంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిల మల్లు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ వడ్డెర సంఘం మరియు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివరాత్రి అయిలమల్లు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేసించి ఆయన మాట్లాడుతూ వడ్డెర ప్రజల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని రాహుల్‌గాంధీ కాంగ్రెస్‌ను గెలిపిస్తే వడ్డెలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని డిక్లరేషన్‌లో కూడా ప్రకటించారని గుర్తు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అధికారంలోకి రాకముందు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని, వడ్డెరలకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేస్తామని వివిధ సభలలో హామీ ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యమంత్రి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చుటకై బిల్లు పెట్టి కేంద్రప్రభుత్వానికి పంపాలని కోరారు. ఈ దీక్షా కార్యక్రమంకు అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, ఉపాధ్యక్షులు పీట్ల మల్లేష్, కార్యదర్శి పీట్ల గండయ్య, తెలంగాణ వడ్డె ఓబన్న వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల యాదయ్యలు మద్దతు తెలియచేయగా, తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎత్తరి గణేష, వరికుప్పల వెంకటేష్, నాయకులు కుంచపు దేవరాజ్, గండికోట కుమార్, శివరాత్రి శ్రీనివాస్, పల్లపు దుర్గయ్య, శివరాత్రి తిరుపతి, వరికుప్పల మల్లేష్, గుర్రం శ్రీనివాస్, దండుగుల వెంకటరమణ, ముద్దంగుల చెన్నయ్య, గారిశెట్టి రాజు, కొడదల శ్రీను మరియు 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు మహిళా నాయకులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు

**-పట్నం సునీత మహేందర్‌రెడ్డి**



ప్రమాణం స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న సునీత మహేందర్‌రెడ్డి

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 22, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ అందరిదని పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని ఎవరూ నిరుత్సాహపడవద్దని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్నం సునీత అన్నారు. మూసాపేటలోని శ్రీ నల్లపోచమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్‌గా ఎల్లేష్ యాదవ్ ఇతర కార్యవర్గ సభ్యులు సోమవారం ప్రమాణం స్వీకార కార్యక్రమానికి సునీత మహేందర్‌రెడ్డితో పాటు హరివర్ధన్ రెడ్డి, బండి రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పోరాటపటిమతోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. పార్టీ మీద ప్రతి కార్యకర్తకు హక్కు ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుందన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మిక సేవా కేంద్రాలుగా ఉండాలన్నారు. ఆలయాల్లో ఎలాంటి రాజకీయాలకు తావులేదన్నారు. నియోజకవర్గంలో ఎండోమెంట్ పరిధిలో 25ఆలయాలు ఉన్నాయని వీటన్నిటికీ త్వరలోనే కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ పండుగ ఇప్పుడే ప్రారంభమైందని మున్ముందు ఇలాంటి పండగలు ఎన్నో జరుగుతాయన్నారు. ఆలయాలను మరింత అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, పుష్పరెడ్డి, నాగిరెడ్డి, వేణు, శేరి సతీష్‌రెడ్డి, లక్ష్మయ్య, జి.వెంకటేశ్వరరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయండి : మాధవరం రోజాదేవి



జోనల్ కమీషనర్‌ను కలిసిన కార్పొరేటర్ రోజాదేవి

**వివేకానంద నగర్, జూలై 22, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్‌ని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ కార్పొరేటర్ రంగారావుతో కలిసి జోనల్ కమీషనర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం డివిజన్‌లోని పలు సమస్యల గురించి వివరించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. డివిజన్ పరిధిలో అవసరమైన కొత్త పనులు గురించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ సానుకూలంగా స్పందించి వర్క్ ప్రాధాన్యత ప్రకారం వీలైనంత త్వరగా మంజూరు చేస్తామన్నారు.

## అల్వాల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిగా యాకేందర్ రెడ్డి

**అల్వాల్, జూలై 22 ప్రభాతవార్త:** అల్వాల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిగా యాకేందర్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ ప్రసూన అమన్‌గల్‌కు బదిలీపై వెళ్ళారు. పట్టణ పౌరులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన ధ్యేయమని యాకేందర్ రెడ్డి తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది బాధ్యతాయుతంగా రోగులకు వైద్య సేవలు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. నూతన వైద్యాధికారిని జెఎసి నేతలు సురేందర్ రెడ్డి, క్రిష్ణారెడ్డి, అరుణ్ రాజ్‌కు సన్మానించారు.

## ఎల్‌ఓసిని అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసిని అందిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, జూలై 22 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధ పడుతున్న వెంకటాపురంకు చెందిన ప్రమోదినికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం అందించారు. వైద్య పరమైన అవసరాలు కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో సహాయకారిగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేద మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన విషయంలో తాను సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి నేతలు అనీల్ కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

## కేశవ రావ్‌కు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్



ప్రభుత్వ సలహాదారుడు కేశవ రావ్‌ను సన్మానిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూలై22ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా కె.కేశవ రావ్ నియమితులైన సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

## ఎల్ఓసీ పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూలై22ప్రభాతవార్త:** ఫత్తే నగర్ ప్రాంతానికి చెందిన ఆనంద్ భార్య ఇందిరా అనారోగ్యంతో బాధపడుతుంది. మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 45 వేల ఎల్ఓసీ పత్రాన్ని శనివారం బాధితురాలుకు ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత రంగ రవిందర్ గుప్త పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాలు గాయపరచారని చీకోటి ప్రవీణ్ ఫిర్యాదు

**పంజగుట్ట, జూలై 22 ప్రభాతవార్త:** హిందువుల మనోభవనాలను గాయపరుస్తూ సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కదిరి క్రిష్ణ అనే న్యాయవాది సోషల్ మీడియా వేదికగా ఓ దేవుడినివిమర్శించారని బీజేపీ నేత, ధర్మరక్ష సంస్థకు చెందిన చీకోటి ప్రవీణ్ సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పోలీసులు స్వీకరంచి ఆరోపించబడిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పోలీసు స్టేషన్‌వద్ద చీకోటి ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీయాలని ఎవరు చూసినా తమ ధర్మరక్ష కార్యకర్తలు సహించరని, హిందూ సమాజం మీద కానీ, దేవతల మీద కానీ ఈ విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

## స్మిత సభర్వాల్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

**సైఫాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** సివిల్స్‌లో దివ్యాంగుల కోటాపై ఐఎఎస్ అధికారి స్మిత సభర్వాల్ చేసిన వ్యాఖ్యలను రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉభయ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు తీవ్రంగా ఖండించారు. ఆమె తక్షణమే దివ్యాంగుల జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె వ్యాఖ్యలు శారీరకంగా దివ్యాంగుల రాజ్యాంగ హక్కులకు, సమాజంలోని మానవ విలువలకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఆమె తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# బిసి డిక్లరేషన్ అమలు చేయాలి



రెవిన్యూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న విష్ణేశ్వరచారి



వినతి పత్రం అందిస్తున్న బిజెపి నేతలు



రాష్ట్రంలో బిసి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ గండిపేట మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నేతలు.



ఎమ్మార్వోకు వినతి పత్రం అందచేస్తున్న ఓబీసీ నేతలు



గోల్కొండ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నేతలు

**దుండిగల్‌లో...**

**దుండిగల్, జూలై 22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి సభలో చేసిన బిసి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరచారి, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌సగర ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈప్రభుత్వం కేవలం రాజకీయ లబ్దికోసం బిసి డిక్లరేషన్ పేరిట బిసిలను మోసం చేసింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బిసి డిక్లరేషన్‌లోని ప్రతి హామి నెరవేర్చాలి, లేదంటే రాజకీయ పార్టీలకు, కులాలకు అతీతంగా బిసిలు అంతా ఏకమై నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేశవరావు, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్‌నాయక్, అశోక్, చక్రధర్, రమేష్, మల్లేష్, జనార్ధన్‌రెడ్డి, నరసింహాచారి, జగదీష్, మల్లికార్జున్‌రావు, అనీష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**అల్వాల్‌లో**

**అల్వాల్, జూలై 22 ప్రభాతవార్త:** ఎన్నికలు సందర్భంగా కామారెడ్డి సభలో బిసి డిక్లరేషన్‌ను ఆరు నెలలులో అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి తన మాటను నిలబెట్టుకోవాలని బిజెపి ఓబిసి మోర్చా నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అల్వాల్ తహసీల్దార్‌కు ఈమేరకు వినతి పత్రం అందించారు. అన్ని బిసి కులాలు సమగ్రాభివృద్ధికి కార్పొరేషన్లు, బిసి యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా ఫీజు రీఎంబర్స్‌మెంట్, మత్స్య సంఘాలకు చేపలు పిల్లలు పంపిణీ చేయక పోవడం, ముదిరాజ్, గంగపుత్ర, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గండిపేట మండలంలో..**

**నార్సింగి, జూలై 22 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, ఈశ్వరప్పలు డిమాండ్ చేశారు. సోమవారం బిజెపి ఓబిసిసెల్ ఆధ్వర్యంలో బిసి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ గండిపేట మండల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన 6.నెలలలోనే కుల గణన చేసి, బిసి కమీషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లను 23.శాతం నుంచి 42.శాతానికి పెంచుతామన్న సీఎం ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ముదిరాజ్‌లు, గంగపుత్రులు, గౌడ్లు, మున్నూరు కాపులు, పద్మశాలీలు, విశ్వకర్మలు, రజకులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండి పడ్డారు. ఎన్నికల్లో నోటికి వచ్చిన ట్లు హామీలు గుప్పించి ఓట్లు దండుకొని గద్దెనెక్కినాక పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బిక్షపతి యాదవ్, మహేష్ యాదవ్, మల్లారెడ్డి, సత్యనారయణ, సిద్దప్ప, నాగేష్, శ్రీశైలం యాదవ్, నర్సింగ్‌రావ్, కిరణ్, శివరాజ్, మల్లేష్, శివకుమార్, ఆనంద్‌రావ్, బ్రహ్మచారి, చిన్నయ్య పాల్గొన్నారు.

**అంబర్‌పేట్, హిమాయత్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయాల్లో...**

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఓబీసీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతం రావు ఆరోపించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ హామీ ఆరు నెలల్లో చేస్తానని హామీ ఇచ్చి, అమలుచేయని కారణంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు అంబర్‌పేట్, హిమాయత్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు సి.వినోద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రమేస్, సి.కృష్ణగౌడ్, కార్పొరేటర్ వై.అమృత, కన్నె రమేష్‌యాదవ్, అజయ్ కుమార్, నాగభూషన్, రవీందర్‌గౌడ్, చుక్కాజగన్ తదితరులు పాల్గొన్నారు.

**గోల్కొండలో..**

**మెహిదీపట్నం, జూలై 22, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం బిజెపి ఓబిసి మోర్చ ఆధ్వర్యంలో గోల్కొండ తహశీల్దార్ అహల్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా బిజెపి సెంట్రల్ జిల్లా యువమోర్చ కార్యదర్శి దేవర వంశీ మాట్లాడుతూ బిసి సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హోదాతో జ్యోతిరావుపూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి 20వేల కోట్ల రూపాయలు వేస్తామని చెప్పి నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి బిసిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో బిజెపి ఓబిసి మోర్చ కార్వాన్ అసెంబ్లీ కన్వీనర్ సుధాకర్ యాదవ్ నాయకులు ప్రభుపూజారి, ముఖేష్ సాగర్, సందేశ్ యాదవ్, సాయి తేజలు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో బోనాలు నిర్వహించాలి : కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్



బోనాల జాతరలలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

**మూసాపేట్, జూలై 22, ప్రభాతవార్త**

భక్తి శ్రద్ధలతో బోనాలు నిర్వహించాలపి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. సోమవారం బోనాల పండుగ సందర్భంగా 124 డివిజన్ పరిధిలోని కమలమ్మ కాలనీ, చంద్రమ్మ కాలనీలలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్‌తో కలిసి పాల్గొని బోనాల జాతరను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పాండుగౌడ్, ఏడుపాయల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, సంతోస్ బిరాదర్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని డిసికి కార్పొరేటర్ వినతి

**అల్వాల్, జూలై 22 ప్రభాతవార్త:**



వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్

బోనాలును పురస్కరించుకుని కొత్త చెరువు కొలనును సమాయత్తం చేయడంతో పాటుగా రోడ్లుకు మరమత్తులు చేపట్టాలని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి డిసి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందించారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో ఈ మేరకు కార్పొరేటర్ డిసితో పలు అంశాలుపై చర్చించారు. బోనాలు నేపథ్యంలో ఆలయాలు వద్ద ప్రభుత్వం పరంగా వసతులు కల్పించాలని కోరారు. వర్షాలు కారణంగా రోడ్ల గుంతలు మయంగా మారా యని డిసికి వివరించారు. సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని డిసి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## బదిలీపై వెళ్తున్న డిఎం రాంమోహన్,సుధాకర్ రావ్‌లకు సత్కారం

**కంటోన్మెంట్, జూలై22ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ డిపో మేనేజర్‌గా 4 సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన ఎల్.రాంమోహన్ ఉప్పల్ వర్క్‌షాప్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బిహెచ్ఇఎల్ డిపో డిఎంగా పనిచేసిన సుధాకర్ రావ్ కంటోన్మెంట్ డిపోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఉద్యోగులు డిఎం రాంమోహన్‌కు వీడ్కోలు,నూతన డిఎం సుధాకర్ రావ్‌కు స్వాగతం పలుకుతూ నిర్వహించిన అభి నందన సభలో కంటోన్మెంట్ డిపో ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ రమణ, ఎం.ఎఫ్. బాల్‌రాజ్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ శ్రీ పతిక్రిష్ణలతో పాటు కంట్రోలర్లు, ఏడిసిడీలు ఇరివురి డిఎంకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు అభినందనలు తెలిపిన నివేదిత

**అడ్డగుట్ట, జూలై22 ప్రభాతవార్త:** బోనాల వేడుకలను పురస్కరించుకొని మోండా డివిజన్ లోని టకార బస్తీలో నివాసం ఉంటున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత తమ కుటుంబ సభ్యులతో కలిసి పద్మారావు గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు రామేశ్వర్ గౌడ్, దాసరి కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న హర్యానా గవర్నర్




హర్యాన గవర్నర్ దత్తాత్రేయను అభినందిస్తున్న మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక

**కంటోన్మెంట్, జూలై22ప్రభాతవార్త:** ఎసికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాలి బోనాల జాతర మహోత్సవాలను పురస్కరించుకొని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక ఆధ్వ ర్యంలో మహబూబ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకలకు హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు ఈటెల రాజేందర్, డాక్టర్ లక్ష్మ ణ్, కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు పి.ఎల్. శ్రీనివాస్, మురళీధర్ రావ్, ధనుంజయ చారి, సదాకేశవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావ్, మహంకాళి జిల్లా బిజెపి అధ్యక్షు లు శ్యామ్ సుందర్ గౌడ్, కంటోన్మెం ట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంశా తిలక్, చిన్న వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



పది మంది బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**హైదరాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న పది మంది బాధితులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో 3 లక్షల 82 వేల రూపాయలు చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్పోరేటర్లు పద్మావెంకటరెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జె.స్వరూపకు 23 వేల రూపాయల చెక్కును, సాయి కార్తిక్‌కు 17 వేలు, ఎం.సతీష్‌కుమార్‌కు 60 వేలు, వాసంతికి 60 వేలు, సలీంఖాతున్‌కు 31,500, షాహనాజ్‌కు 60 వేలు, బి.రమేష్

## దళిత ఎస్ఐ మృతికి కారణమైన పోలీస్‌లను అరెస్టు చేయాలి

**సైఫాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** అశ్వారావుపేట దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ మృతికి కారణమైన అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బందిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్, అడ్వకేట్ గోలి నరేష్, కార్యదర్శి బి.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసుల అధికారలను సర్వీస్ నుంచి డిసెమిస్ చేయాలన్నారు. ఈ ఘటనపైన బాధ్యులపై చర్యలు తీసుకోకుండా కుల వివక్షతను ప్రదర్శించిన బద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ, రాష్ట్ర డిజిపిలపై చర్యలు చేపట్టాలని ఆయన జాతీయ ఎస్సీ కమిషన్‌ను కోరారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వడ్లమూరి మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ శాఖలో ఎస్సీ, ఎస్టీ అధికారులపై ఆధిపత్యకుల అధికార వర్గం కుల వేధింపులకు పాల్పడి, దళితులపై దాడులు చేయడం అత్యంత హేయమన్నారు. తన మరణానికి కారణం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ సిఐ, ఇతర సిబ్బంది అని రాములు శ్రీనివాస్ మేజిస్ట్రేట్ ఎదుట మరణ వాగ్మూలం ఇచ్చినా పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసులోని బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా చట్టాన్ని తుంగలో తొక్కారని ఆయన ఆరోపించారు. తద్వారా దళిత జాతి జీవించే మానవ హక్కులు కాలరాసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. శ్రీరాములు శ్రీనివాస్ మృతి కేసులో నిందితులకు ఆ జిల్లా మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు. శ్రీనివాస్ మృతి ఘటనపై తెలంగాణ పోలీస్ శాఖలోని ఎస్సీ, ఎస్టీ వర్గం స్పందించాలని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే బాధ్యత ఉన్నత పోలీసు అధికారుల పైన, హోం శాఖకు బాధ్యత వహిస్తున్న సిఎంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై జాతీయ ఎస్సీ, మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విచారణ జరిపించాలని కోరారు.

## గాయకుడు జయరాజ్‌కు పలువురు పరామర్శ

**పంజగుట్ట, జూలై 22 (ప్రభాతవార్త):**

నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యం తో చికిత్స పొందుతున్న ప్రముఖ గాయకుడు, కవి జయరాజ్‌ను పలువురు పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జీ.చెన్నయ్య, మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ ఛైర్మన్‌లు గోపాజు రమేష్, మన్నె శ్రీధర్‌రావు తదితరులు జయరాజ్ త్వరగా కోలుకోవాలని, దళిత సమాజానికి, తెలంగాణా సమాజానికిఆయన సేవలు ఎంతో అవసరమని, ఎన్నో దళిత ఉద్యమాలు, ప్రజాస్వామ్య ఉద్యమాలలో పాల్గొని తన పాటలతో ఉత్తేజం పచేశారన్నారు.


IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT, AT : HYDERABAD
O.S. No. 5555 OF 2023

BETWEEN M/S. UNIQUE CATERERS, REP. BY ITS PROPRIETOR SRI PRAKASH JUMANI S/O TIKAMDAS JUMANI AGED ABOUT 69 YEARS. OCC. BUSINESS, R/O. 6-3-652, SOMAJIGUDA, HYDERABAD .. PLAINTIFF

AND

M/S. AMRUTHA ESTATES, REP. BY ITS PARTNER SRI Y. RAJEEV REDDY ... DEFENDANT

TO,
M/S. AMRUTHA ESTATES, REP. BY ITS PARTNER SRI Y. RAJEEV REDDY, R/O. H.No. 6-5-71, PUNJAGUTTA, HYDERABAD 500082 (SOLE DEFENDANT)

Sir

Whereas the above named Plaintiff filed the above suit seeking specific performance against the defendant. The Hon'ble Court posted the matter on 30-07-2024 at 10.30 A.M. for your appearance.

Therefore you are requested to appear before this Hon'ble V Addl. Junior Civil Judge, City Civil Court at Hyderabad on 30-07-2024 at 10.30 A.M. either in person or through Counsel duly instructed. Otherwise the matter will be heard and decided exparte in your absence.

SCHEDULE PROPERTY

All that the premises admeasuring 3400 S.Ft. at D-65 (Municipal No. 6-3-649/1,2 & 3/C1,C2, Dhruvatara, Amrutha Estates, Somajiguda, **Hyderabad** and bounded by **NORTH:** lane to Kautilya building, **SOUTH:** Road, **EAST:** Dhruvatara building compound wall, **WEST:** Maheshwari Chambers compound wall

("BY ORDER OF THE COURT")
**(V.RANGA REDDY)** Advocate
Plot No. 33 & 34, Vikasnagar, Saroornagar, Hyderabad 35. Ph. 24055849 / 9848079418
(COUNSEL FOR THE PLAINTIFF)


## ఎమ్మెల్సీని కలిసిన ముదిరాజ్ మహాసభ నాయకులు

**దుండిగల్, జూలై 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు సోమవారం మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముదిరాజ్ కులానికి ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వినతిపత్రం ద్వారా కోరారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
డివిజన్-14, GHMC

నిట్ నెం.14/E.E.14/GHMC/2024-25, తేది: 22.07.2024
పనిపేరు: GHMC, KZ, డివిజన్-14 క్రింద వివిధ పనులు. అంచనా మొత్తం/ECV : (రూ. లక్షల్లో) : 31.85. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేది, సమయం : 23.07.2024 ఉ.11.00గం. 26.07.2024 ఉ.11.00గం. అధికారి పేరు, చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, GHMC.
DIPR.No.1995-PP/CL/Advt/1/2024-25 తేది: 22.07.2024


## రేవంత్ అంకుల్ మా ప్రాణాలకు రక్షణేది వార్తకు వివరణ

**కొంపల్లి, జూలై 22, ప్రభాతవార్త**

కొంపల్లి పురపాలక సంఘ పరిధిలోని ఎన్‌సిఎల్ కాలనీ చిన్నారులు శునకాల సమస్యలపై పేట్ బషీరాబాద్ ఠాణా నందు ఫిర్యాదు చేసినట్లు వచ్చిన వార్తపై కొంపల్లి మున్సిపాలిటీ నుండి వివరణ ఇచ్చారు. బ్లూ క్రాస్ సొసైటీ ద్వారా 15.01.2023 నుండి శునకాల నివారణ, స్టెరిలైజేషన్ నిమిత్తం వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్లూ క్రాస్ సొసైటీతో పలు చర్యలు తీసుకోబడుతున్నాయని తెలిపారు. జూలై 17వ తేదీన కూడా 12 శునకాలను పట్టుకుని స్టెరిలైజ్ చేయడం జరిగిందన్నారు. కానీ కొంపల్లి మున్సిపాలిటీ నుండి ఎప్పటికపుడు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ కూడా ఈ ప్రాంతానికి చుట్టు ప్రక్కల నుండి కొన్ని శునకాలు ప్రవేశిస్తున్నాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి భయ భ్రాంతులకు గురి కావద్దని తెలిపారు. సమయానుకూలంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.


IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS SECUNDERABAD AT : SECUNDERABAD
O.S.NO. 473 OF 2024

Between:-
1) Buragapally Usha, W/o. Late B Krishna Murthy, Aged about 77 Years, Occ: Retired, R/o. Flat No.113, Manju Ranga Towers, Anand Bagh, Malkajgiri, Hyderabad, Telangana. 500047
2) Buragapally Madhusudhan, S/o. Late B. Krishna Murthy, Aged 47 years, Occ: Pvt Employee. R/o Flat 407, Jaya Chandra Enclave, Walker Town, Padmarao Nagar, Secunderabad, Telangana 500025.
3) B.Sridhar, S/o. Late B. Krishna Murthy, Aged 45 years , Occ Pvt Employee R/o Flat No.113, Manju. Ranga Towers, Anand Bagh , Malkajgiri, Secunderabad - 500047.
4) Sunanda Ramesh W/o Ramesh Dharmagadi Sethumadhavan D/o Late B Krishna Murthy Aged 51 years, Occ. House wife, R/o 12/C-3-C, Rathinammal street, Jains Antariksa, Kodambakkam, Chennai. Currently residing at Dusseldorfer Landstr 348,47259, Duisburg, Germany. (Represented By GPA Holder Buragapally Madhusudhan ).
....Plaintiffs

And

1 Mandal Revenue Officer Lower Tank Bund Road, Eichiguda, Lower Tank Bund, Hyderabad, Telangana, 500080
2 All concerned ...Defendants

To
1. Mandal Revenue Officer Lower Tank Bund Road, Eichiguda, Lower Tank Bund, Hyderabad, Telangana, 500080
2. All concerned

Take notice that the above named plaintiffs filked the above suit for declaration, declaring the above name persons as legal heirs of Late B. Krishna Murthy S/o B. Subbacharyulu to declare the above named persons as legal heirs of Late B. Krishna Murthy who died intestate on 21st July 2017 and case is posted to 2-8-2024 at 10:30 a.m. before the said court .If any person is claiming to be the legal hairs of the said deceased or having any objection in granting the said relief may appear before the said court on said date at 10:30 a.m. either in person or through your advocate and submit your contention with documentary proof Failing with the matter will be heard and decided ex parte.

(By order of the court)
D.S Kishen
Advocate
#Flat No G-3, Jewel Residency, Plot No 64&65, Teachers Colony, Opp Union Bank .East Marredpally Secunderabad 5000026. Telangana
Mobile 9885440966
Counsel for plaintiffs



బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా, మా క్లైంట్ అదితీయ చక్రబోర్తి W/o. రవి అగ్నిహోత్రి వయస్సు సుమారు 44 సంవత్సరాలు, వృత్తి: గృహిణి. నివాసం: ప్లాట్ నం.1903, గోల్ఫ్ ఎడ్జ్ టవర్స్-B, నానక్‌రామ్‌గూడ గ్రామం యొక్క సర్వే నెం. 27/1, 27/2, 27/3, మరియు 27/4 శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ 500032, రంగారెడ్డి R.O వద్ద రిజిస్టర్ అయినది మరియు జి.విజయ నిర్మల మరియు ఇతరుల చే అమలు జరపబడి రవి అగ్నిహోత్రి పేరిట వున్న 28-12-2014 తేదీ 2017 యొక్క DOC నం. 15801 సేల్ డీడ్‌ను ఆమె ఇంటి నుండి 6-4-10/1, ప్లాట్ నం.501, భవానీ శ్రీ షీలా ఎవెన్యూ, న్యూబోల్‌కపూర్, క్రిష్ణనగర్ కాలనీ సికింద్రాబాద్-500080కు ప్రయాణం చేస్తుండగా పోగొట్టుకున్నారు. మార్కెట్ రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, నానక్‌రామ్‌గూడ గ్రామం వద్ద వున్న సర్వే నం. 27/1, 27/2, 27/3, మరియు 27/4 లోని ఎక.4-482గుంటలలో 35.74 చ.గజాలు విస్తీర్ణ భూమి యొక్క అవిభాజ్య వాటా భూమితో సహా, కామన్ ఏరియా కలుపుకొని, 1901 చ.అడుగుల నిర్మిత ప్రాంతంతో గోల్ఫ్ ఎడ్జ్ నివాసిత కాంప్లెక్స్ యొక్క టవర్-B, 19వ అంతస్తు పై 1903 నం అపార్ట్‌మెంట్ యొక్క సంపూర్ణ యజమాని అయివున్నారు. సరిహద్దులచే : ఉత్తరం : కారిడార్, దక్షిణం : బహిరంగం. తూర్పు : బహిరంగం. పడమర : బహిరంగం. గిఫ్ట్ డీడ్ DOC నం.20385 ఆఫ్ 2019 తేదీ: 30.10.2019 ద్వారా కలిగి ఆమె భర్త రవి అగ్నిహోత్రిచే అమలు జరపబడి మరియు రంగారెడ్డి R.O వద్ద రిజిస్టర్ చేయబడినది.

పైన పేర్కొనబడిన ఆస్తిపై ఎవరికైనా వ్యక్తి/లు, ఆర్థిక సంస్థలు ఏరకమైన క్లైమ్, అభ్యంతరాలు, ఆసక్తి లేదా హక్కు వున్నట్లయితే ఇందుమూలముగా, డాక్యుమెంటరీ నిరూపణతో సహా రాతపూర్వకంగా తెలుపుతూ దానిని దిగువ సంతకందారునికి ఇక నుంచి ఈ ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోపుగా తెలియచేయవలసి వున్నది మరియు ఎవరికైనా అది కనుగొనబడితే నాకు స్వాధీనం చేయవలెను.

సం/- K. రజని
న్యాయవాది
ఇం.నం.16-113, ఫ్లాట్ నం 101, సాయి విహార్ రెసిడెన్సీ, న్యూ మిర్జాల్‌గూడ, మల్కాజ్‌గిరి -500047
సెల్‌నం: 9393099916/7842003860



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MEDCHAL - MALKAJGIRI DISTRICT AT : MALKAJGIRI
O.S.NO. 721 OF 2024

Between:
**1.Kodakalla Manga,** W/o Late. Kodakalla Venkata Satya Srinivas, aged about 58years.
**2.Kodakalla Gautham,** S/o Late. Kodakalla Venkata Satya Srinivas, aged about 30 years, Both are R/o. Flat No.202, Sri Vindhya Residency H.No.30-265/21/47/202, R K Housing Colony, Near Sai Baba Temple Malkajgiri, Secunderabad, Telangana-500062.
...Plaintiffs
AND
1.The Tahsildar, Neredmet
2.All Concerned. ...Defendants

PUBLIC NOTICE

Take notice that the Plaintiffs herein have filed the above suit for declaration to declare the Plaintiffs as the Legal Heirs of the deceased Kodakalla Venkata Satya Srinivas who died on 10-05-2021, the above suit is posted on **12.08.2024**. If any person/ persons having any objection/interest in respect of the claims made by the plaintiffs may appear before the said Hon'ble court at **10.30 A.M.** by person or through an advocate failing which the matter will be decided on merits.

SCHEDULE OF THE PROPERTY

All that the Residential Flat bearing No: 202, in the second floor of "SRI VINDHYA RESIDENCY", (muncipal bearing NO. 30-265/21/47/202), with built up area of 680.00 square feet, including common areas, along with undivided share of land admeasuring 30.00 sq. yards or 25.00 square meters, out of 300.00 Sq. Yards, on plot No. 47, in part of Survey No's 296 & 297, situated at R.K.Housing colony, Neredmet, under Malkajgiri Municipality and mandal, Ranga Reddy District, (Ground + 2 floors) and bounded as under:-
NORTH By : CORRIDOR, SOUTH BY : OPEN TO SKY, EAST BY : OPEN TO SKY, WEST BY : FLAT NO. 203.

// BY THE ORDER OF THE COURT //
Sd/- A.VIJAY KUMAR, BOMMARAJU SRINIVAS, KURAPATI SAMANTH
Advocates
#101 Yasvin Crescent Park Apartments, Near TCS Adibatla, Adibatla, RR Dist - 501510.



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT : L.B. NAGAR
O.S. NO. 451 OF 2024

BETWEEN:
Sri. Vinay Kumar Tandle s/o. Late. Sri. Kishore Kumar Tandle, Aged about : 37 years, Occupation: Private Employee, resident of : H.No.1-7-1/3, Flat No.201, II Floor, Vijaya Sai Elite Apartments, Maruthi Nagar, Chaitanyapuri, Saroornagar (M), R.R.Dist.
... Plaintiff
AND
1. The Tahsildar, Saroornagarmandal, Ranga Reddy District.
2.All concerned. .. Defendants

CLAIM: SUIT FOR DECLARING THE PLAINTIFF AS THE LEGAL HEIR OF THE DECEASED, Late. Kishore Kumar Tandle, PLAINT FILED UNDER ORDER VII RULE 1 R/W.SEC. 26 OF C.P.C.

PUBLIC NOTICE

The Legal Heir Declaration Suit in O.S.No.451/2024was filed before the Hon'ble V Addl.Junior Civil Judge Court, R.R. District, at L.B. Nagar for declaration of the Plaintiffs as Legal Heirs of the Deceased Late. Sri. Kishore Kumar Tandle. The said suit is posted on 08/08/2024 for Final hearing. Under the instructions of the Hon'ble Court, it is called upon to raise objections/claims, of any, from any party, on the said date i.e. 08/08/2024 at 10.30 a.m. at the above premises, before the Hon'ble Court.

(By Order of The Court)
Sd/xx xx xx
PRABHAKARA RAO ADIRAJU
ADVOCATE
H.No.2-26/7, Plot No.15/A, Patiguda, Ragannaguda Post, R.R.Dist. PIN: 501510
Mobile:7799557171



IN THE COURT OF THE 26TH ADDITIONAL CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD.
E.P.NO. 2525 OF 2023
IN
O.S.NO. 735 OF 2010

Between :
Miss Pushapa Thakoor (died per Lrs) and another
...Petitioners/Plaintiffs
AND
Jayaker G.Earnest and others
...Respondents/Defendants

To,
2. Moorampudi Rajendra Prasad, Son of Late M.Venkat Rao, aged about 53 years, Occupation: Business, Resident of Flat No.123, D-4 Block, No.6-3-1092, Shanti Shikhara Apartments, Raj Bhavan Road, Somajiguda, Hyderabad 500082.

NOTICE

Please take notice that the above-named petitioners have filed the above E.P for execution of decree passed in o.s.no. 735 of 2010 before the above court. The said E.P is stand posted to 29.08.2024 at 10.30am for your appearance and disposal. failing to appear on the said date and time, the matter would be proceeded ex-parte as per law.

(By order of Honourable Court)
Sd/-Shaik Iqbal Pasha
Advocate
M/s Mahmood and Co
Advocates,
No.1-7-347 to 349, 2nd floor, Mahmood Complex, Parklane, Secunderabad.

## సమస్యలు లేని పాఠశాలలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కెఎల్ఆర్


ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్

**సరూర్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వపాఠశాలలను సమస్యలు లేకుండా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల బడంగ్‌పేట్ కార్పొరేషన్ పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు, సమస్యల పరిశీలించడానికి సోమవారం మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి, కార్పొరేటర్లతో కలిసి మల్లాపూర్, బాలాపూర్‌లలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పాఠశాలలకు కావాల్సిన మౌళిక సదుపాయాల విషయమై వారితో చర్చించారు. అనంతరం కెఎల్ఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనీ ఇందులో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి ఎడ్యుకేషన్‌పై దృష్టి సారించారని వెల్లడించారు. కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరాలు, సమస్యలపై నివేదిక తయారు చేయించి ప్రభుత్వానికి సమర్పిస్తామని ఆయన తెలిపారు. గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదనీ ఈ మేరకు గంజాయి సేవించే వారిని ముఖ్యంగా దానిని విక్రయించే వారి పట్ల కఠినంగా ఉంటుందని కెఎల్ఆర్ హెచ్చరించారు.

**కెఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఉపాధ్యాయులనిస్తాం: కిచ్చెన్న**

టీచర్లు లేని ప్రభుత్వ పాఠశాలలకు కెఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఉపాధ్యాయులను కేటాయిస్తామని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పాఠశాలల ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి అందుకు అనుగుణంగా తమ ట్రస్ట్ ద్వారా చేయూతనిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నేనావత్ బాలు నాయక్, గౌర రమాదేవి శ్రీనివాస్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలతో పాటు మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, ఎర్ర జైహింద్, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గుడ్ల శ్రీనివాస్, గట్టు బాలకృష్ణ, ఇక్కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి: చైర్‌పర్సన్ అనురాధ


కార్మికులకు రక్షణ పరికరాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ అనురాధ తదితరులు

**తుర్కయంజాల్, జూలై 22 ప్రభాతవార్త:** పారిశుద్ధ్య కార్మికుల సేవలు వేల కట్టలేనివని వారికి కావలసిన సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి పేర్కొన్నారు. రాగన్నగూడ వార్డు కార్యాలయంలో కౌన్సిలర్లతో కలసి సిబ్బందికి సబ్బులు, నూనెలు, రక్షణ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వారికోసం త్వరలో హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు. సీజినల్ వ్యాధుల వ్యాపిస్తుండడంతో సిబ్బంది మున్సిపాలిటీ ప్రజలకు మంచి సేవలు అందించి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మా మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు రేవెల్లి హరిత యాదగిరి, గుండా భాగ్యమ్మ ధనరాజ్, కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, కంబాలపల్లి ధనరాజ్, బొక్క రవీందర్‌రెడ్డి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఈఈ హరీష్, జవాన్ మధు తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జూలై 22 ప్రభాతవార్త :** హబ్సిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ రాంరెడ్డి తెలిపారు. హబ్సిగూడ గ్రీన్‌హిల్స్ ఫీడర్ పరిధిలోని గ్రీన్‌హిల్స్ కాలనీ, బృందావన్ కాలనీ, వసంత్ విహార్ కాలనీ, వివినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే విధంగా హెచ్‌ఎంటి నగర్ ఫీడర్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బ్యాంక్ కాలనీ, హెచ్‌ఎంటి రోడ్డు,బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## అభివృద్ధి పనుల పరిశీలన : పన్నాల


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**నాచారం, జూలై 22 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం అధికారులతో కలిసి కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. బ్రహ్మపురికాలనీ, నాగలక్ష్మినగర్, ఐడీఏ ప్రధాన రోడ్డులో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ రూ. 42 లక్షల వ్యయంతో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను త్వరితగతిన, నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులను పూర్తి చేసేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్, దినేష్, బీఆర్ఎస్ నాయకులు పైళ్ల ప్రవీణ్, దుల్మిట్ట దయాకర్ రెడ్డి, రంగా సురేష్ గౌడ్, మెండ రఘు తధితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ కోహినూర్ అల్లానికి మద్దతు ధర

**మలక్‌పేట, జూలై 22 ప్రభాతవార్త:** ఉస్మాన్‌గంజ్ వ్యాపారస్తులతో చర్చలు జరుపుతున్న రాష్ట్ర వ్యవసాయ అదనపు సంచాలకులు రవికుమార్ ప్రభుత్వ ఆదేశాలమేరకు జహీరాబాద్‌లో కోహినూరు అల్లం పండించే రైతులకు మద్దతు ధర ఇప్పించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఉస్మాన్‌గంజ్ వ్యాపారస్తులతో అదనపు సంచాలకులు రవికుమార్ ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో పండించే కోహినూర్ అల్లానికి ఏ విధంగా అయితే మద్దతుధర వస్తుందో అదేవిధంగా జహీరాబాద్ కోహినూరు అల్లానికి కూడా మద్దతు ధర ఇవ్వాలని వ్యాపారస్తులకు సూచించారు. దానికి స్పందించిన వ్యాపారస్తులు మద్దతు ధర ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎస్ దామోదర్, అధికారులు పుష్పమాధురి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు


అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దానం శేఖర్ తదితరులు

**మలక్‌పేట, జూలై 22 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలఉత్సవాలు నిలుస్తాయని అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, దానం శేఖర్ పేర్కొన్నారు. మలక్‌పేట మార్కెట్‌లో హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం ఉపాధ్యక్షుడు పి.కతలయ్య, డి.రాజు, లక్ష్మణ్, డి.రాజు, ఎం.కుమార్, నర్సింగ్‌రావు, మురళి, శంకరప్ప, కుమార్, వెంకటేష్, శరణప్ప, రమేష్, రవీందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విద్యాటౌన్‌షిప్‌లో సిసి రోడ్డు, యుజిడి పనులు ప్రారంభం: మేయర్ పారిజాత


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్ శ్రీ విద్యాటౌన్ షిప్‌లో ఫేస్-3లో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు, యుజిడి పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్పొరేషన్ నిధులతో చేపడుతున్న ఈ పనులను ఆమె స్థానిక కాలనీవాసులతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎఇఇ బిక్కు నాయక్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పెద్దబావి సమరసింహారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, టివి థామస్, అశోక్‌రెడ్డి, వెంకటరావు, గోపాల్ నాయక్, సోమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి సభలో సిఎం రేవంత్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న సామ రంగారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు

**ఎల్.బి.నగర్, జూలై 22 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సామా రంగారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలలలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23శాతం నుండి 42శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గొల్ల, కురుమలకు రెండవ దశ గొర్రెల పంపిణీలో భాగంగా రూ.2 లక్షలు లబ్ధిదారుని ఖాతాలో ఎందుకు వేయలేదన్నారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదని, బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువత వ్యాపారాల నిర్వహణ, ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి మరిచిపోయారా అని ఎద్దేవా చేశారు. బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారన్నారని, మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా, బిడ్లు ఆహ్వానించి రూ.100 కోట్ల అవినీతికి తెరలేపారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే బీసీల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్‌యాదవ్, కార్యదర్శి సంజయ్‌గణతి, నిర్వహణ కార్యదర్శి కూతురు మురళి, ఎల్‌బినగర్ అసెంబ్లీ కన్వీనర్ పోల్కం ప్రశాంత్‌ముదిరాజ్, అధికార ప్రతినిధి రాంపురం శ్రీనివాస్, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, అనిల్‌కుమార్, లక్ష్మిప్రసన్న, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగుల సమాజానికి స్మిత సబర్వాల్ క్షమాపణలు చెప్పాలి : డాక్టర్ పద్మావతి

**మలక్‌పేట, జూలై 22 ప్రభాతవార్త:** ఐఎఎస్ అధికారి స్మిత సబర్వాల్ వికలాంగుల సమాజానికి క్షమాపణలు చెప్పాలని ప్రముఖ కళాకారిణి, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మలక్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత రెండు రోజులనుండి సోషల్ మీడియాలో ఐఎఎస్ అధికారి స్మిత సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు వికలాంగుల మనోభావాలు, ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. రాజ్యాంగం మాకు కల్పించిన హక్కులతో హిర సింఘల్ లాంటి వారు ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. చట్టాల తయారీలో ఉండే ఒక ఐఎఎస్ అధికారి ఇంత చులకన చేయడం సరి కాదన్నారు. మా ఉనికిని మరోసా ప్రశ్నార్థకం చేయవద్దని, నకిలీ సర్టిఫికేట్ల ఏరివ ఏరివేత జరగాలన్నారు.

## పింక్ సర్కిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైనిక్‌పురిలో మహిళా మేళా..

**నేరెడ్‌మెట్, జూలై 22 ప్రభాతవార్త:** పింక్ సర్కిల్ ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సైనిక్‌పురిలోని ఎం.కె రావు మెమోరియాల్ హాల్‌లో మహిళా మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా 50 స్వయం ఉపాధి మహిళా వ్యాపార వేత్తలు తమ ఉత్పత్తులను స్టాల్ల ద్వారా ప్రదర్శించారు. నూతన ఉత్పత్తులను కొనేందుకు ప్రజలు బారులు తీరారు. తమ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా 20మంది పేద విద్యార్థులకు సహాయం చేయడం జరిగిందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

## నేర రహిత సమాజం కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలి : సిపి సుధీర్‌బాబు

**సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలి..**
**నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా దర్యాప్తు విధానాలు..**
**రోడ్డు ప్రమాదాల విశ్లేషణ, నివారణ బృందాల ఏర్పాటు..**


సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు

**నేరెడ్‌మెట్, జూలై 22 ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో నేరరహిత సమాజం కోసం అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి చేయాలని పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో జరిగే నేరాలను అరికట్టాలని, నేరస్థులను పట్టుకోవడంలో, నేర పరిశోధనలో, సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీ టీవి కెమెరాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా వేసి తిరిగి నేరాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్టేషన్‌కు ఫిర్యాదు కోసం వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. విబిబుల్‌కు పోలీసులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులు తమపరిధిలో ఉండే స్టేషన్లను తనిఖీ చేయాలన్నారు. అనుభవం ఉన్నవారికి ఆయా విభాగాల్లో పనిచేసేందుకు అవకాశం ఇస్తామన్నారు.

**సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలి...** పోలీసులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీ విధానంతో ఉండాలని, చట్టపరిధిలోనే పనిచేయాలన్నారు. దర్యాప్తు నిబంధనలకు అనుగూణంగా నేర పరిశోధన జరగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నరస్థులు తప్పించుకోవద్దన్నారు. డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని, కేవలం ఎస్‌వోటి బృందాలు మాత్రమే కాకుండా గతంలో ఎస్‌ఒటిలో పనిచేసిన అనుభవం ఉన్న అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలను అరికట్టడంలో తమవంతు బాధ్యత వహించాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల ద్వారా బాధితులు కోల్పోయిన డబ్బు మొత్తం రికవరీ అయ్యేలా పనిచేయాలన్నారు. మహిళా సంరక్షణకోసం చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో యాదాద్రి డీసిపి రాజేష్ చంద్ర, ఎల్బీనగర్ డీసిపి ప్రవీణ్ కుమార్, ఎస్బి డీసిపి కరుణాకర్, క్రైమ్ డీసిపి అరవింద్ బాబు, మహేశ్వరం డీసిపి సునీతరెడ్డి, ఉమెన్ సేఫ్టీ డీసిపి ఉషా విశ్వనాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పాగొట్టుకున టివిని ప్రయాణీలకు అందజేత


పోగొట్టుకున్న టివిని బాధితులకు అందజేస్తున్న డిపో మేనేజర్, సిబ్బంది

**మలక్‌పేట, జూలై 22 ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సులో టివిని ప్రయాణీకులు మర్చిపోవడంతో దిల్‌సుక్‌నగర్ ఆర్టీసి డిపో మేనేజర్, సిబ్బంది ప్రయాణీకులకు అందజేసారు. ఈ నెల 20వ తేదీన 107 వి/ఆర్ నెంబర్ బస్సులో టివితోపాటు బస్సులో ప్రయాణించి దిగేటప్పుడు టివిని మరిచి దిగిపోయారు. దీంతో ఆర్టీసి బస్సు కండక్టర్ విమల, డ్రైవర్ రామదాసులు టివిని గుర్తించి బస్సులోని ఇతరత్రా ప్రయాణీకులతో టివి గురించి విచారించి అనంతరం డిపోకు తీసుకువచ్చారు. కాగా టివిని పోగొట్టుకున్న ప్రయాణీకులు తమ వద్ద టిక్కెట్ ద్వారా ఎంక్వయిరీ చేసి డిపోకు రాగా వారిని డిపో మేనేజర్ సమక్షంలో వారికి అందజేసారు. దీంతో ప్రయాణీకులు సంతోషం వ్యక్తం చేసారు. ఆర్టీసి ఉద్యోగుల క్రమశిక్షణను గుర్తు చేస్తూ కండక్టర్ విమల, డ్రైవర్ రామదాసులు డిపో మేనేజర్ హరి అభినందించారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి


ఎస్ఈకి వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

**హయత్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కేంద్రంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్లు సిద్ధంకి కృష్ణారెడ్డి, దండెం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు విజేందర్‌రెడ్డిలు విద్యుత్ శాఖ ఎస్ఈ కరుణాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దఅంబర్‌పేట స్మశానవాటిక వద్ద విద్యుత్ దీపాలు పని చేయకపోవడంతో కారుచీకట్లు కమ్ముకుంటున్నాయని, విద్యుత్ స్థంభాలను పునరుద్ధరించాలని కోరారు. కాలనీల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైనచోట అదనపు సామర్థ్యం ఉన్న ట్రాన్‌ఫార్మర్లను అమర్చాలని విన్నవించారు. ఇతర విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎస్ఈ సాధ్యమైనంత త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

## రోడ్లపై వరదనీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి


రోడ్డుపై నిలిచిన వరదనీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసీకి శివారు ప్రాంతం కావడంతో హయత్‌నగర్ డివిజన్‌పై అధికారులు సరైన దృష్టిసారించడం లేదని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి విమర్శించారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా డివిజన్‌లోని పలు కాలనీలలో రోడ్లపై వరదనీరు చేరి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన సిద్ధి వినాయక కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లపై వరదనీరు నిలిచి ఉండడాన్ని పరిశీలించి వరదనీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ చంద్రశేఖర్‌కు సూచించారు. సీసీరోడ్లు లేకపోవడంతో వరదనీరు రోడ్లపై చేరుతోందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై అధికారులు దృష్టిసారించి దశలవారిగా సీసీరోడ్లు వేసి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వల్ల ఏదేని ఇబ్బంది ఏర్పడితే వెంటనే తనకు సమాచారం అందించాలని కాలనీవాసులకు సూచించారు.

## ఉప్పల్ - వరంగల్ జాతీయ రహదారిలో వర్షం నీటి నిల్వ గుంతలు ఏర్పాటు


వర్షం నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేస్తున్న అధికారులు

**వార్త ప్రభావం**

**ఉప్పల్, జూలై 22 ప్రభాతవార్త :** ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి అధ్వాన్నంగా తయారైన విషయంపై 'వార్త' దినపత్రికలో వచ్చిన కథనానికి జిహెచ్ఎంసి అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఎల్‌బినగర్ జోనల్ ఎస్ఇ అశోక్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, ప్రాజెక్ట్ మేనేజర్ మల్లికార్జున్, డిఇ నిఖిల్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి, సూర్యనాయక్ తదితరులు వరంగల్ జాతీయ రహదారిని సందర్శించారు. రహదారిలో వర్షకాలంలో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఇ అశోక్‌రెడ్డి, ఇఇ నాగేందర్ తెలిపారు. సుమారు 5లక్షల లీటర్ల కెపాసిటీతో ఉప్పల్ సబ్ స్టేషన్ వద్ద ప్రత్యేక వర్షం నీటి గుంత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆటోమెటిక్ పంపింగ్ ద్వారా నీటిని బయటకు తరలిస్తామని తెలిపారు. దీంతోపాటు ప్రధాన రహదారిలో గుంతలు పడిన ప్రాంతాలో తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. కారిడార్ పనులు కూడా త్వరలోనే టెండర్లు పిలిచి కొత్త కాంట్రాక్టర్ ద్వారా చేపడుతామని తెలిపారు. ఉప్పల్ నల్ల చెరువు నుంచి రింగ్‌రోడ్‌వరకు రోడ్డుకిరువైపులా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. రహదారిలో మట్టి వేసి గుంతలు పూడ్చడంతోపాటు వర్షాలు తగ్గిన తర్వాత కొత్త రోడ్డు కూడా వేస్తామని తెలిపారు. జాతీయ రహదారిలో వాహనదారులకు ఇబ్బంది లేకుండా తమ వంతు సహకారం అందిస్తున్నామని ట్రాఫిక్ సిఐ లక్ష్మిమాధవి తెలిపారు. వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి డిక్లరేషన్ అమలు చేయాలని తహసీల్దార్‌కు బిజెపి నేతల వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి కార్పొరేటర్లు తదితరులు

**ఉప్పల్, జూలై 22 ప్రభాతవార్త :** తెలంగాణలో బిసి డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ బిజెపి ఒబిసి మోర్చ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, ఒబిసి మోర్చ ఇంచార్జీ సదానందం, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, మాజీ వైస్ చైర్మన్ గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ , రావుల బాలకృష్ణగౌడ్, బొంగు రమేష్‌గౌడ్, గోనె అంజయ్య, రఘుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిసి కమిషన్ నివేదిక ఆధారంగా బిసిలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని, గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో దశ గొర్రెల పంపిణీ చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. బిసి సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేయాలని, అసెంబ్లీలో చట్టబద్ధమైన హోదాలో పూలే సబ్‌ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు స్వామి యాదవ్, పి.వెంకటేశర్లు, తెలంగాణ సంపత్, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చండి

**తుర్కయంజాల్, జూలై 22 ప్రభాతవార్త:** హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వడ్డెరుల హక్కులపై తలపెట్టిన నిరాహార దీక్షలో రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిల మల్లు, ప్రధాన కార్యదర్శి వరకుప్పల వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాలలో వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడంకోసం బిల్లు పెట్టి పార్లమెంటుకు పంపాలని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దండుగుల వెంకటరమణ, కుంచపు దేవరాజ్, గండికోట కుమార్, దేరంగుల జ్యోతి, వరికుప్పల కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హిందూ స్మశానవాటిక అభివృద్ధికి చర్యలు : కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్


హిందూ స్మశానవాటిక పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జూలై 22 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లోని హిందూ స్మశానవాటిక పనులు త్వరలోనే చేపడుతామని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కోరారు. ఈ మేరకు సోమవారం స్మశానవాటికలో చేపట్టనున్న పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ హిందూ స్మశానవాటిక పనులను టెండర్ ప్రక్రియ ద్వారా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాజ్‌కుమార్, బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, శ్రీనివాస్‌యాదవ్, మాస శేఖర్, చేర్యాల శ్రీనివాస్, బొల్లం లక్ష్మణ్, శ్యామ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కులస్థులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి

**ఉప్పల్, జూలై 22 ప్రభాతవార్త :** ముదిరాజ్ కులాన్ని బిసి డి నుంచి బిసి ఏ గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేస్తూ రామంతాపూర్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుర్ర మహేందర్ ఆధ్వర్యంలో పలువురు నేతలు తహసీల్దార్ వాణిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు మోరా రవికాంత్, కార్యదర్శి డి.కనకయ్య, యువత అధ్యక్షుడు పందుగ బాలు, రోయ్యల కృష్ణమూర్తి, మహంకాళి లక్ష్మణ్, కొంపల్లి రవీందర్, అంబటి జగదీష్, గోనె అంజయ్య, శ్రీకాంత్, తెలంగాణ సంపత్, కీసరి శంకరయ్య, శ్రీశైలం, కనకయ్య తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి ఎన్నికల్లో ముదిరాజ్‌కు న్యాయం చేస్తామని హామీలిచ్చి అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముదిరాజ్ సంఘం నేతలు పాల్గొన్నారు.